రేడియో

చెణుకులు

సమకాలీన
సమాజానికి
సరిగా
అద్దం పట్టిన
14
వ్యంగ్య రచనలు

భలే చెక్క
టొక్కు
టేరము!

పన్నాల
సుబ్రహ్మణ్యభట్టు

This page intentionally left blank

రేడియో చెళుకులు

(అనే 14 ప్రహసనాల పొది)

రచన

పన్నాల సుబ్రహ్మణ్యభట్టు

సామాన్య ప్రచురణలు
పిఠాపురం

ప్రతులు : మూడువేలు

ప్రచురణ : ఏప్రిలు 75

(C) పన్నాల సుబ్రహ్మణ్యభట్టు

ఈ పుస్తకంలోని జోకుల విత్తనాలు. పాత్రలు.
పేర్లు, సన్నివేశాలు రచయిత అనుమతి లేకుండా
ఎక్కడా ఉపయోగించుకొనకూడదని హెచ్చరిక

వెల : మూడు రూపాయలు

ముఖపత్రం + బొమ్మలు : బాపు

ప్రతులకు :

సామాన్య ప్రచురణలు
పిఠాపురం

నవోదయ పబ్లిషర్సు
విజయవాడ-2

ముద్రణ :

బెస్ట్ ప్రెస్
విజయవాడ-2

రంగు

పత్రికల్లో రెండు మూడు అంగుళాల చదరపు బోర్డర్‌లో కార్టూన్ బొమ్మలు చూస్తుంటాము. ఒక హాస్యసంఘటనను చిత్రించే పీటి క్రింద వ్యాఖ్యానాలు వుంటాయి. ఇవి ఏరోజు కారోజు చదువరుల మనసుల్లో పైకి తేలుతూండే రాజకీయ ఆర్థికసాంఘిక సమస్యలమీద సంఘటనలమీద చిత్రకారుడు చేసే మృదువైన హేళనపూర్వక వ్యాఖ్య అన్నమాట. ఇవి మంచి చమత్కారమూ, హాస్యమూ కలిగిస్తూంటాయి. ఇవి కార్టూన్ చిత్రాలు. అది కేవలం దృశ్యకళ.

అదేవిధంగా శ్రవ్యరూపకాలను ప్రదర్శించే రేడియోలో అయిదు నిముషాలకు మించని సంఘటనలను, సన్నివేశాలను, సంభాషణల ద్వారా ఇతర ధ్వన్యాత్మక వాతావరణం ద్వారా చిట్టి చిట్టి శ్రవ్యరూపకాలను ప్రదర్శిస్తే కార్టూన్ చిత్రాల్లోలాగే చమత్కార హాస్యాలను సమర్థంగా నిర్వహించవచ్చునితోచి, ఇటీవల రేడియో కార్టూన్ లేక చెణుకులు అనే కార్యక్రమాన్ని వినిపిస్తూ వుండటం, రేడియో శ్రోతలకు పరిచిత విషయమే.

చెణుకులంటే కొరడాను ఝళిపించినప్పుడు అయ్యే చప్పుడు. ఈ చిట్టిరూపకాలలో చమత్కార హాస్యాలకు తోడు కొంత హేళన, కొంత మందలింపు సజెస్టివ్‌గా వ్యంగ్యంగా స్ఫురించాలనేదికూడా ఆశయం. అందుకే ఇవి చెణుకులయ్యాయి.

మాటకూ, దాని అర్థానికీ దాని వెనుకవుండే భావానికీ ఎంతో శక్తి వుంటుంది. కృష్ణశాస్త్రిగారన్నట్లు మాటకు రంగు, రుచీ వాసన

వుంటాయి. ఒక మాటకే అంత గ్రంథం వుంటే, కొన్ని మాటలతో కూర్చిన వాక్యానికి గానీ, రెండు మూడు పాత్రల మధ్య నడచిన సంభాషణకిగానీ ఎంతో ఫలితం వుంటుంది. వాక్యాలను పలికేతీరులో, మాటనూ మాటనూ కలపటంలో, విరామం ఇవ్వడంలో, తిరిగి అందుకోవటంలో, ఎన్నో ఫలితాలు సాధించవచ్చు.

మేలమాడుట, ఎకసెక్కమాడుట, ఎగతాళి, వేళాకోళం, హాస్యము, పర్యాచకము, హేళన, దెప్పిపొడుపు, వెటకారము, వెంగెము, — ఇన్ని రకాలుగా ఉన్న ఈ మాటల అర్థాలు, స్థూలదృష్టికి ఒకటిగా కనిపించినా, సూక్ష్మదృష్టితో చూసినప్పుడు – సంవాదంలో, ప్రయోగంలోనూ, ఈపర్యాయ పదాలలో ఒకదానికీ ఒకదానికీ మధ్య ఎన్నో అవాంతర భేదాలు సన్న చాయల్లో విడివడే తేడాలు వుంటాయి. వీటన్నిటినీ ఆకళించుకొని, ప్రయోగించినప్పుడే చెణుకులకు సార్థకత, సాఫల్యము సిద్ధిస్తాయి.

ఈ చెణుకుల రూపకాలను రచించి సమర్థంగా నిర్వహించిన కొద్దిమంది (ముగ్గురు నలుగురు) రచయితలలో చిరంజీవి పన్నాల సుబ్రహ్మణ్యభట్టు– ఒకరు.

కేవలం విని ఆనందించదగ్గ ఈ చిట్టిచిట్టి శ్రవ్యరూపకాలు చదివినప్పుడుకూడా కార్టూను బొమ్మలను చూసినప్పుడు కలిగే స్వారస్యం లాంటిది — ఏదో — కలిగి చదువరులు ఆనందింపగల్గుతారని ఆశిస్తాను.

చిత్రకళ, సాహిత్యరచనలలో అభినివేశమూ, చొరవగల చిరంజీవి భట్టు వెలువరిస్తున్న ఈ తొలిసంకలనం సహృదయులకు ఆదరపాత్రం కాగలదని దీవిస్తున్నాను.

విజయవాడ,
3 నవంబరు '74

బాలాంత్రపు రజనీకాంతరావు.

రుచి

ఇందున్న పదునాల్గు చెణకులు ఆకాశవాణి ప్రసారం చేయగా రసజ్ఞులు శ్రవణానందకరంగా విన్నారు; సెభాస్ అన్నారు. The proof of the pudding lies in its eating.

ఇప్పుడు పుస్తకం వస్తూంది. హృదయానందకరంగా చదివి పరిపూర్ణానందం పొందండి. ఏ ముద్దుకు ఆ ముద్దే. మొత్తం పుస్తకం చక్కగా చదివాను. అందున్న చక్కని హాస్యం చవిచూచాను. రచయిత ప్రాయమందుపిన్న, ప్రతిభావిభవంబునందు మిన్న. పఠితగా పరిచయ వాక్యాలు వ్రాయటం నా కర్తవ్యం. సాటిహ్యూమరోపతి ప్రాక్టీషనరు; మేమిద్దరమూ వొకతానులో ముక్కలం. అదే మా సాన్నిహిత్యం.

రుచుల భాషలో చెప్పాలంటే యీ రసగుళికలు కమ్మగా వున్నాయి. ఈయన మణికట్టులో పటుత్వమైన హాస్యం వుంది. కటుత్వం లేదు. ఔచితి, సభ్యత, రమ్యత మిళావు చేసి సుకుమార సుందర సురిచిరమైన హాస్యం అందించారు. భట్టుగారి విట్టులో మల్టీ విటమిన్సు వున్నవి. అంచేత పుష్టికరం. హెల్దీహ్యూమరు మెదడుకు మేత. జన్మతః హాస్యదృష్టికలవాడు కనుకనే గ్రాస్‌నుంచి గాడ్‌వరకూ యేఇతివృత్తం తీసికొన్నా రసవత్తరమైన హాస్యసృష్టి చేయగల దిట్ట. పాషాణంలోంచి పీయూషం పిండగలడు. వీరి జోకు నాజూకుగా వుంటుంది. డోకు పుట్టదు. ముతకమోటు లేదు. వీరి సరసం తమలపాకుతో, తలుపు

చెక్కతోకాదు: పన్నీరుజల్లు, పల్లేరు ముళ్ళు కావు: పూలచెండుతో, దుడ్డుకర్రతోకాదు. గంటూ గాయం వుండదు. కొరడా ఝళిపించటమే కాని, వాతలు పడవు. Beautiful satire కాని, Biting Sarcasm కాదు. ఈయన హ్యూమర్‌లో పెర్‌ప్యూమ్ వుంది.

వర్తమానకాలంలో అన్నివిధాలా సమాజం దిగజారిపోయింది. ఎటుచూసినా degeneracy and degradation – సంస్కారణాభిలాషి కావటం వల్ల contemporary society లో ills and evils ఆలంబనంగా తీసికొని వ్యంగ్యంసాయంతో timely hit కొట్టారు. పర్యవసానం ఈ కార్టూన్సు. Ridicule, derision, irony పుష్కలంగా వాడి చైతన్యవంతమైన Satire సాధించారు. అతిశయోక్తులు మెండుగా వున్నవి. మరి, the humour of the cartoon is fundamentally exaggerated. Carricature is an art of exaggeration. మనిషిలో వుండే విశిష్టతను కాని, వైపరీత్యాన్నికానీ, ప్రత్యేకతనుకాని, ' విలక్షణాన్ని కానీ, అవలక్షణాన్నికాని పెంచి పొడిగించి, గోరంతలు కొండంతలు చేసి అతిశయింప చేస్తేనేకాని యీ చిట్టి రూపకాన్కి life రాదు. వస్తు స్వీకరణలోనే భట్టిజం కొట్ట వస్తున్నట్టుగా కానవస్తుంది. శీర్షికల నామకరణంలోనే individuality ప్రస్ఫుటమవుతుంది. పచ్చగడ్డిసభలు, ఇడ్లీకొరత, పిల్లుల వాటా, సేవన్నగారికి సేవ, కార్డుజీవితాలు, చౌకరాజ్యం–వగైరా వగైరా. కోటానుకోట్ల ప్రజాద్రవ్యం బాండీకూట్సు గుటకాయస్వాహా చేస్తూంటం, శంకుస్థాపన రోజునే సమాధిరాయికూడా పడటం రివాజయి, శుష్కవాగ్దానాల ప్రబుద్ధుల సిగుచేటు కార్యకలాపాలు, అన్నీ కరువై అలమ

టిస్తున్న నిత్యజీవితంలో తనిఖీదార్ల బెడద, ప్రతివస్తువుకీ కార్డు సిస్టం impose చేసి సామాన్యగృహస్థుని బ్రతుకు దుర్భరం చేయటం — ఇలాంటివన్నీ చిత్రీకరణ బహుసొంపుగా చేసారు. మొండి ఘటం గుమాస్తాను ఒ. టి. తో లొంగాతీద్దామని ఆఫీసరు ప్లాను వేస్తే అతగాడు ఆఫీసు స్టోరు రూముకే కాపురం shift చేసి ఎలా out-wit చేసిందీ అద్భుతంగా వుంది. Biter bit అనే తృప్తి యిస్తుంది పఠితకు. భార్యామణి కనీస కోర్కెలు comply చేస్తే భర్తకు తుదకు ఆపెనే పాతగుడ్డలు అడుక్కోవలసిన గతి ఏర్పడినట్లు చేసిన ముగింపులో రమణీయమైన హాస్యం సరఫరా చేసారు. ఆంగ్లభాషలో మిడిమిడి జ్ఞానమున్న కొందరు తెనుగోళ్ళు మాతృభాష మరచిపోయినట్లు పోజువేసి ఇంగ్లీషులో ప్రసంగం చేస్తుండే జబ్బు వుంది. తర్జుమాదార్ల చేత అలాంటి వ్యక్తిని నానాగడ్డి కరిపించి బాబోయి, నేను తెలుగులోనే మాట్లాడ్తాను అనేట్లు చేయించారు. ఇందులో పసందైన హాస్యం వుంది. మచ్చుకు కొన్ని చూపెట్టా, అన్నీ మెచ్చుకో తగ్గవే. ఇదంతా Surface న, Beneath న బ్రహ్మాండమైన వ్యంగ్యం దాగివుంది. విస్తరణలేని విశ్లేష నైపుణ్యం వుంది.

These Cartoons really represent the rotten state. Inherent గా short but very sweet. పొట్టివే, అయినా గట్టివే. చదువరి ఊహకు limit యేమివుంది? Brevity is the soul of wit. Humour lies in what is suggested. He has given novel treatment to the variety of subjects chosen. మామూలు మతాబు మందే వ్యంగ్యం డొల్లలో కూర్చి కుదించి చిచ్చుబుడ్లు తయారీ చేశారు. అందుకే మోతలో పైకిలేచి కాంతి వెదజల్లాయి.

He has shown mirror up to nature. 'చౌకరాజ్యం' లో earthly paradise చూపారు. కలలో పాలు త్రాగేటప్పుడు జిల్లేడు దొప్పలతో యెందుకు, బంగారు గిన్నెలతోనే! రేట్లు చుక్కలు తాకే రోజుల్లో imaginary చౌకరాజ్యం చూపినందుకు నా అభినందనలు.

పాత్రల పేర్లలో నూత్న పదాలనే సృష్టించారు — క్షేమశాస్త్రి, చెదలయ్య, తిండినాధం, పిల్లిపెసర, ఖడ్గచిత్ర, అర్ధమంగళం, — యిత్యాది — వీటిల్లోంచి హాస్యం తొణికిసలాడింది. రూపలావణ్యం, భావసౌందర్యం, అర్థవైభవంతో కూడి, ఉక్తి శక్తి మూలకమైన చమత్కృతి సమ్మేళనంతో ఉజ్వలమైన తీక్షణమైన, మనోజ్ఞమైన హాస్యోత్పత్తి చేశారు. వైయక్తికమైన బలహీనతలు, నాయకుల అకృత్యాలు, బోగస్‌సంస్థల దోపిడీలు—అన్నిటినీ దూయబట్టారు. Hypocrites, humbugs ను దుమ్ము దులిపారు.

కుశాగ్రధిషణతో, పదప్రయోగనిపుణతతో మధురమైన మార్దవమైన శరచ్చంద్ర చంద్రికలలాంటి చల్లని శక్తిమూల హాస్యంతో వేళాకోళం పట్టిస్తూ అవహేళన చేస్తూ, ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేస్తున్న దుష్టశక్తులను చీల్చి చెండాడుతూ, mock-seriousness maintain చేస్తూ, ఈ నూతన సాహిత్యప్రక్రియద్వారా క్రొత్త వాఙ్మయ రూపంలో పాఠకులకు a veritable feast of roaring laughter చేశారు. మాటలకు potency పొదిగి మంత్రించి ప్రయోగించారు. Dialogues లో ఒక్క వ్యర్థపదంకూడా లేదు. అంత కట్టుదిట్టంగా బిగించారు. Anatomy of humour లోకి దిగను.

Dissection of wit కి పూనుకోను. ఇందులోని హాస్యం మరీ విడమర్చి చెప్పటానికి ప్రయత్నించను. ఎందుచేతంటే nothing kills a laugh quicker than the explanation. నన్ను నవ్వించు చూద్దాం అని ఛాలెంజి చేస్తూ బిగదీసుకొని కూర్చున్న cynic సైతమూ యీ గ్రంథం చదువుతూ విరగబడి నవ్వితీరుతాడు. వ్యంగ్యం appreciate చేయడానికి పఠితకు కొంత Standard అవసరమేమో.

వడ్డించిన నిండువిస్తరి మీ ముందు పెట్టి యిది రుచ్యం, యిది గ్రాహ్యం, యిది అమృతస్వరూపం అని లెక్చరివ్వడం చాదస్తం. Attack. You will relish all the dishes. సుష్టుగా ఆరగించండి. భుక్తాయాసం వస్తే, బాధ్యత భట్టుగారిదే.

రచనంతా superb గా వుంది, అయితే superlatives వాడటానికి నా ఆంధ్రత్వం అడ్డు వస్తున్నది.... Read, Re-read అవశ్యం పఠనీయం. మా చిరంజీవికి ఆశీస్సులు.

విజయవాడ
28-11-74 } 'హాస్యచతుర్ముఖ' పుచ్చా పూర్ణానందం.

వాసన

వాసనలు అనేక రకాలు. వీటిలో సు–దుః– విభేదాలు కేవలం యాదృచ్ఛికాలు. గులాబి, చందనం సువాసనగలవని సామాన్యంగా అంగీకరించవచ్చు. అవి అందరికీ ఆనందం కలిగిస్తాయని గాని, ఆరోగ్యకరమైనవనిగాని మన శాస్త్రజ్ఞులు ఒప్పుకోరు. ఎవరి చెమట వారికి 'సు' వాసనే నంటారు వారు; అంటే మనసుకి ఒక వింత సంతృప్తి కలిగిస్తుందని వారి నిర్ణయం.

'పంది బురద మెచ్చు' ప్రసిద్ధమైన నా నుడి.

హాస్యం అనేకరకాలు. ఒకొక్క రకానికి ఒకొక్క చిత్రమైన రంగు, రుచి, వాసన ఉంటాయి. వ్యక్తిత్వాన్నిబట్టి, ఒకొక్కరికి ఒక్కొక వాసనగల హాస్యం నచ్చుతుంది. పందికి బురదలాగ, కొందరికి అపహాస్యం నచ్చుతుంది. వికలాంగుల్ని అవహేళనచేసి ఆనందించే ప్రవృత్తి కొందరికుంటుంది.

అయితే, ప్రతి మానవుడూ ప్రత్యేక వ్యక్తిగాక, సామాజికుడు కూడా. అంచేత సామాజిక వ్యక్తి విషయంలో, కొంచెం స్థూలంగా హాస్యానికిగల వాసనలను సు–దుః–ఉపసర్గలతో క్రోడీకరించవచ్చు.

పదిమందిలో కూర్చుని వింటున్నప్పుడు, మనలో మనం సిగ్గుపడేట్టు చేసేవి, సాటిశ్రోతలతో ఏ ఒక్కరి మనసులోనైనా గుచ్చుకొని బాధపెట్టేవి – కంపు అంటే దుర్వాసనగల హాస్యమని చెప్పొచ్చు.

మనలను చూసి, మన అవివేకాన్ని చూసి, మనమే నవ్వుకునే టట్టు చేసే హాస్యం సువాసనగలది. అది మనసుకి ఆనందంతోపాటు ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది.

ఈ గ్రంథంలో 'చెణుకులు' రేడియోద్వారా చాలమంది విన్నవి విని ఆనందించినవి.

నేనూ కొన్ని విన్నాను–రేడియోలో, కొన్ని ఆయనే చదివి వినిపించారు. కొన్ని చదువుకున్నాను. కాస్త వాసనాభేదం కనిపించింది. 'పిల్లులవాటా' చదువుకుంటున్నప్పుడు వాసన ఏదో గుర్తుపట్టరానిదిగా తోచింది. అత్తరుసీసామీద పేరు చూసి, మూత తీసి వాసన చూస్తే పేరుకీ వాసనకీ పొంతన కుదరనట్టు. కాని రచయిత చదివినప్పుడు, ముఖ్యంగా అన్ని పాత్రలూ తూ. గో. జి. యాసతో చిత్రంగా లాగి మాట్లాడినప్పుడు – కాస్త వాసన పసిగట్టగలననిపించించి. రేడియోలో వింటే ఎలా ఉండేదో. ఇదిమాత్రం వినడం జరగలేదు.

ఇంచుమించు ఇరవై ఏళ్ళుగా సంఘజీవితంలో రకరకాల కాలుష్యాలు– ఎప్పుడో ప్రవేశించినవే– అన్ని రంగాలలోనూ వ్యాపిస్తున్నాయి. అవినీతి, స్వార్థం, కరువు, కాటకం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, జనాభా పెరుగుదల – మధ్యతరగతి ప్రజల జీవితాన్ని ఆరోజుకారోజు దుర్భరం చేస్తున్నాయి. సమాజానికి వక్తలు మధ్య తరగతి ప్రజలేకనక, ఈ సమస్యలగురించి ఘాటుగానో సూటిగానో రచనలద్వారా, తమ అక్కసు తీర్చుకుంటున్నారు, ఈప్రజ. నాటకాల్లో, నవలల్లో, కథల్లో కవితల్లో, తమదుగ్ధ, కసి, ఆవేశం, ఆవేదన, వెళ్ళ

బుచ్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్ని కల్పించిన కొన్ని సంఘశక్తులను, తీవ్రంగా దుయ్యపడుతున్నారు. చాలా రచనల్లో – ఆ దుష్టశక్తులను శిష్టశక్తులు జయించి భూస్థాపితం చేసినట్టు, తద్వారా సమాజానికి మేలు జరిగినట్టు వర్ణించి తృప్తిపడుతున్నారు, రచయితలు. ఇంట్లోపడ్డ దొంగకు సర్వస్వం అర్పించి, ఆతరువాత ఆ దొంగను పట్టుకొని హానం చేశామని కలగన్నట్టు, ఇది చంటివాళ్ళ మనస్తత్వం.

"శైశవము దాటి, మనసు ముసలితనమ్ము – నాశ్రయించుట దేశ మర్యాద...." మన భారతీయులకు. కొన్ని శతాబ్దాలుగా ప్రౌఢయౌవన దశలు ఎరుగదు మనజాతి.

హాస్యం – ఆరోగ్యకరమైన హాస్యం – ప్రౌఢవయసులక్షణం. పెరిగినమనిషి, చిన్నపిల్లవాడుగా నటిస్తూ, తన్నూ, తనసాటివారినీ, వేళాకోళం చేయడంలోనే అటువంటి హాస్యం పుట్టుకొస్తుంది. కొంతలో కొంత ఈ 'చెణుకుల'లో ఆ లక్షణం కనిపిస్తుంది. మనజాతి కూడా కాస్త పెరుగుతోందనడానికి ఇవి ఒక నిదర్శనం.

ఈ 'చెణుకులన్నీ' వర్తమాన సమాజజీవితంలోని అసందర్భాల చుట్టూ అల్లినవే. 'గండుపిల్లి' ఒక మానవవ్యక్తేకాక, మనిషిలోని గండుపిల్లితనానికి ప్రతిరూపం–అలాగే 'పచ్చగడ్డి' 'ఎండుగడ్డి' కూడా, వీటిలో చాలాపేర్లు సంకేతాలు. 'సేవన్న' 'సర్వభక్షం' 'చిత్రహింస' 'అభ్యుదయం' వగైరా స్పష్టంగా తెలిసే సంకేతాలు. అక్కడక్కడ హాస్యం, అపహాస్యంగా దిగజారినా, ప్రతి 'చెణుకు' వెనక లోకజ్ఞత ఉంది.

ప్రత్యేక 'చెణుకుల్ని' విపులంగా సమీక్షించి మీ కుతూహలాన్ని చంపను. విడదీసి చెపితే ఇక హాస్యమేముంటుంది? మీ రెలాగా చదువుతారు. చదివి నవ్వుకుంటారు, తప్పకుండా. ఏ 'చెణుకు' ఏ వాసనగలదో ఎవరికివారు స్వయంగా నిర్ణయించుకోండి.

అది మీ మనస్సు పొందిన పరిణతిని బట్టి ఉంటుంది. దాన్ని 'పూర్వజన్మవాసన' అంటారు వైదాంతికులు.

ఇక చదవండి.

4—4—75
మద్రాసు

పాలగుమ్మి పద్మరాజు.

అభిషంరణ

డొక్క చించే రాతలు రాస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. అంతలా చీరే భుజబలమూ లేదు. డొక్కశుద్ధితో రాయాలని జాగ్రత్త పడ్డాను. డోలు కొంచెమయినా వాయించాలి కాబట్టి ఈ ముక్కలు

'73 వేసవినుండి '74 తొలకరిదాకా గలవారాలలో చెదురు మదురుగా ఈ చెణుకులు వ్రాసాను. తెలుగునాటా, దేశంలోనూ, ఆనాటి రాజకీయ చైతన్యమూ, సభలసోదీ, నిత్యావసర వస్తువుల యిబ్బందీ వీటికి ప్రేరణ. నేను చెప్తేనేకాని పోల్చుకోలేని కొన్ని ప్రతిబింబాలు వున్నాయి. కావాలని వేరేమార్గం పట్టించాను.

ఈ ప్రహసనాలు అందరి మనసుల్లోనూ, ఉరకలు వేయాలంటే ఓ పద్ధతి వుంది. వార్షికోత్సవాలలోనూ, సభలు సమావేశాలలో వచ్చే అయిదు, పదినిముషాల విరామసమయాలలో వేదికమీద ఉత్సాహవంతులు వేషం లేకుండా అభినయంతో, వెనుకధ్వనులతో, సంభాషణలని పోషిస్తేచాలు – తెలుగువారి పొట్టలకీ బుర్రలకీ పనితగిలినట్లే. దీనికీ వేరే నా అనుమతి అక్కర్లేదు.

మంచి నిజాన్ని చెప్పాలంటే మంచి 'అపహాస్యధోరణి' ద్వారానే సాధ్యమని దొర (అంటే తెలివైనవాడు, విదేశీయుడు అని నా అర్థం. ఇక్కడ షా) మాట.

అలాటి నిజాల నిక్షేపాలని, ఎగసెక్కాల గునపాలతో త్రవ్వి తీసాననే అనుకుంటున్నాను. పేజీమించుతోంది. కానివ్వండి.

రచయిత.

పదార్థాలు

1.	పచ్చగడ్డి సభలు	1
2.	ఉద్యోగ ప్రకటనలు	6
3.	సంగీతసభ	11
4.	ఇడ్లీ కొరత	15
5.	చిత్రప్రదర్శన	19
6.	సేవన్నగారికి సేవ	23
7.	నాయకుల పొదుపు	28
8.	పిల్లుల వాటా	33
9.	విజ్ఞాని	37
10.	ఓ. టి. గుమాస్తా	41
11.	కార్డు జీవితాలు	45
12.	పునాదుల రాయన్న	49
13.	చౌకరాజ్యం	55
14.	చీరల భార్య	60

This page intentionally left blank



(అంతర్జాతీయ పచ్చగడ్డిమహాసభలు - తెలుగు
దేశంలో ఒకచోట

కార్యదర్శి : సోదరులారా నిశ్శబ్దం. మనం ఎన్నో నెలలుగా ఎన్నోశ్రమలకు ఓర్చి పచ్చగడ్డి కోసుకొన్నాం. కాని మనకి గడ్డి కూడా కరువొచ్చిన రోజులు వచ్చాయి. మనం పశువులమీద ఆధారపడినవారం. పశువులు మనమీద ఆధారపడి ఉన్నాయి. మనం

పచ్చగడ్డిమీద ఆధారపడి ఉన్నాం. ఈ పచ్చగడ్డిని సరిగా వినియోగించాలంటే ఏమేం శ్రద్ధలు తీసుకోవాలో ప్రపంచ పచ్చగడ్డి సంఘం అధ్యక్షులు శ్రీ ఎండుగడ్డి సీతారాంగారు చెప్తారు. ఈనాడు సీతారాంగారు మన మధ్య ఉండటం చాలా ఆనందకరం. ఈయన తెలుగువారే. తెలుగు జాగా వచ్చినవారే, కాని..........

(వెనుకనుండి కలకలం: 'సీతారాంగారు మాట్లాడాలి గడ్డిగురించి చెప్పాలి. ఎండుగడ్డి సీతారాంగారికీ జై...')

సోదరులారా నిశ్శబ్దం. మీ పశువుల్ని జాగ్రత్తగా ఓ ప్రక్కన కట్టండి. అవి అరుస్తే మనకి మాట వినబడదు. గడ్డి మేసేస్తే ఆటికి గడ్డి ఉండదు. ఈయన తెలుగువారే. గత 15 సంవత్సరాలుగా ఖండఖండాంతరాలు తిరిగారు. అందువల్ల ఇంగ్లీషులో తప్ప మాట్లాడటంలేదు. పచ్చగడ్డిమీద ఉపన్యాసాలు ఇస్తున్నారు. లేతగడ్డి పరకల్లాంటి విశేషాలు ఈయన ఇంగ్లీషులో చెప్తారు. పిల్లి పెసరగారిని ఆటికికూడా—కూడాతెలుగు చెప్పమంటున్నాను. ఇప్పుడు ఎండుగడ్డి సీతారాంగారు ఉపక్రమిస్తారు.

ఎండుగడి సీతారాం : ఆల్ ది గ్రాస్‌గోయర్స్ ఆఫ్ ది వరల్డ్ యునైట్.

పిల్లి పెసర : ప్రపంచంలో పిల్లి పెసర యువకుల్లారా ఏకం కండు.

ఎం, సీ : థాంక్సు టు మిస్టర్ పిల్లి పెసరా! హియీజ్ ట్రాంస్ లేటింగ్ మీ ఏప్టలీ. ఫర్ ది లాస్ట్ ఫిప్టీన్‌యియర్స్ ఐవజ్ఎవే‌ఫ్రం ఆంధ్రప్రదేశ్ టు అండర్‌స్టేండ్ యువర్ ప్రాబ్లెంస్, బట్ ఐకెన్‌నెవ్వర్ ఫర్‌గెట్ తెలుగు.

పిల్లి పెసర : పిల్లి పెసరగారు నన్ను మోపుగా అనువాదం చేస్తున్నారు. థాంకులు. గత పదిహేను ఏళ్ళుగా ఆంధ్ర ప్రదేశ్ క్రింద నిలబడ్డాను. కాని తెలుగు అసలు మాట్లాడలేను. (నవ్వులు, కలకలం)

ఎం. సీ : మిస్టర్ పిల్లి పెసర ఈజ్ టూ ఛారిటబుల్.

పి. పె : పిల్లి పెసరగారు దయామయులు.

(పిల్లి పెసర దిగాలి—అరుపులు)

ఎం. సీ : సెక్రటరీ వాట్‌డూ దే సే........

కార్యదర్శి : (కంగారుగా)....సోదరులారా నిశ్శబ్దం. ఇప్పుడు గడ్డి గోవిందంగారిని వేదికపైకి రావలసిందిగా కోర్తున్నాను. ఆయన తెలుగు చెప్తారు. కంటిన్యూ సార్.

ఎం. సీ : థాంక్యూ! ది హోల్ పాప్యులేషన్ స్టాండింగ్ ఆన్‌టు లెగ్సు ఆర్ ఫోర్‌లెగ్సు ఫేసేస్ ఏక్యూట్ షార్టేజి ఆఫ్ గ్రాస్.

గడ్డి గోవిందం : ప్రపంచంలో పాపలంతా పెయ్యలుగానీయండి గిత్తలు కానీయండి గడ్డి దొరక్క నానాగడ్డి కరుస్తున్నారు.

ఎం. సీ : మై ఫ్రెండ్ గడ్డిగోవిందం ఈజ్ పొయటిక్.

గ. గో : నా స్నేహితుడు గడ్డిగోవిందం గడ్డికోసం ఏ పనయినా చేస్తాడు.

ఎం. సీ : హి కెన్‌కట్ ఎజోక్ ఆన్ హిమ్‌సెల్ఫ్.

గ. గో : ఏ గడ్డయినా సరే కోయడానికి సిద్ధం.

(కలకలం, తప్పు....తప్పు దిగాలి. గడ్డిగోవిందం దిగాలి)

ఎం. సీ : ఈజ్‌హిరాంగ్?

కార్యదర్శి : నిశ్శబ్దం. ఇకనుంచి మందుల రొట్టయ్యగారు తెలుగు చెప్తారు.

ఎం. సీ : ఆన్ దిగ్లాసియర్స్ ఆఫ్‌ది ఆల్ఫ్స ఎన్యూవెరెయిటీ ఆఫ్ ది ఫాదర్ ఈజ్ గ్రోన్.

మందుల రొట్టయ్య : ఆల్ఫ్సరాష్ట్రంలో క్రొత్తసీసాల్లో ఒక మందు దొరుకుతుంది.

ఎం. సీ : ట్రూ. మిస్టర్ రొట్టయ్య హేజ్ గాన్ ఫర్‌దర్ అండ్ పుట్‌ది టానిక్ ఇన్ బాటిల్సు,

మం. రొ : గడ్డినుంచి తీసిన ఈ మందు రోజూ వాడండి. ధాతువృద్ధి కల్గుతుంది. మేహపొదలు పోతాయి.

ఎం. సీ : ట్రూ ఫర్ కామన్ సెన్సు,

మం. దొ : కామెర్లు, ఉబ్బులు పోవడానికి రోజుకి రెండు సార్లు వాడండి.

ఎం. సి : అయ్యా, రొట్టయ్యగారూ ! మీరు ఆపండి. నేను తెలుగులోనే మాట్లాడ్తాను. బుద్ధి వచ్చింది బాబూ బుద్ధి వచ్చింది. తెలుగులోనే మాట్లాడ్తాను.

ఉద్యోగ ప్రకటనలు

తండ్రి : అబ్బాయ్! ఈ పూటయినా ఉద్యోగాలేమైనా పేపర్లోపడ్డాయేమో చూడూ!

కొడుకు ; ఇక మనకేం ఉద్యోగాలు రావు నాన్నా! అప్పు లిస్తున్నారట! బూట్ పాలిష్ కొట్టు పెట్టుకుంటాను.

తం ; రామరామ! ఇంజినీరింగు డిగ్రీ పుచ్చుకొన్నది యిందుకట్రా! పేపరు రోజూ తిరగేయమని

మొత్తుకుంటున్నానా! ఫస్టు క్లాసులో ప్యాసయ్యావ్! ఒక్క ఉద్యోగం దొరకదురా నీకు! పైగా బైపు షార్టుహాండుకూడా ప్యాసయ్యావు. గుమాస్తా ఉద్యోగమైనా దొరకదురా!

కొ : రెండు సంవత్సరాలబట్టి చూస్తున్నాను నాన్నా! అవే ప్రకటనలు ఏవో యింటర్వ్యూలు చివరకి 'ల'కి ఏత్వం, దకు కొమ్ము. నాన్నా! బూటు పాలిషు కొట్టుపెట్టుకొంటే ప్రజాసేవ చేయవచ్చు!

తం ; ఏమిటి ప్రజాసేవా! సరే!

కొ : సాయంకాలం అంకెలాటకు కమీషను మీద చీటీలు వ్రాసుకోవచ్చు. ఆ రెండువందలు నెలకు చులాగ్గా సంపాదించవచ్చు నాన్నా!

తం : ఎంత సంపాదించినా ఉద్యోగంలో ఉన్న గౌరవం వేరురా అబ్బాయి! చూడుచూడు. ఆ పేపరు చూసి నాకు తెలుగులో కాస్త చెప్పు. ఊరికే యింగ్లీషులో లబలబ లాడకు.

కొ : (పేపరు చూస్తూ) కావలెను. గుమాస్తాలు కావలెను. పోటీ భజనపార్టీ ఏర్పాటుచేసే అపచార కేంద్రంలో పనిచేయుటకు ఉత్సాహమూ ధైర్యమూఉండి అవమానము భరించకలిగి హిందీ వచ్చిన యువకుడు కావలెను. కనీసవిద్యార్హతగా

డాక్టరేటు పట్టమున్న మంచిది అవతలవారి కార్యక్రమములు అభాసు చేయుటకు వీలుగా ఇంజనీరింగులో డిప్లొమాకాని, డిగ్రీకాని ఉన్న మంచిది. తలరాతలు దిద్దుకోగలిగి యుండవలెను. ఇంగ్లీషుతోబాటు సంస్కృతము, పాళీ రష్యనుభాష తెలిసిన మంచిది.

తండ్రి : ఏమిటి యిన్నిభాషలు కావాలిటరా!

కొ : ఆఁ అరాచకీయములలో అనుభవముండవలెను. ఇక జీతం నెలకు 35–పావలా–38–అర్ధ–40 ఈ స్కేలుపై 35 రూ॥ల దగ్గర ప్రారంభించబడును, బత్తెములు లేవు. ప్రొబేషను కాలము మూడు సంవత్సరములు. శిక్షణకాలములో చోళ్ళ జావ యివ్వబడును.

తం : ఏమిటీ? చోళ్ళజావ!

కొ : ఆ చోళ్ళజావ! రోజుకు పదిపైసలు బీడీఎల వెన్నుకూడా యివ్వబడును. సిఫార్సులు పని చేయవు.

తం : ఇదిగో అబ్బాయి! ఈ ఉద్యోగం మనకి వద్దుకానీ యింకొకటి ఏమయినా ఉందేమో చూడు.

కొ : వాంటెడ్! ఎలయన్సు! వాంటెడ్ మాస్టర్ ఫర్ ఆర్ఫనేజి వాంటెడ్! ....

తం : కాస్త తెలుగులో ఏడవమని ఎన్నిసార్లు చెప్పానురా!

కా : అలాగే....ఆ(....అల్లకల్లోలగ్రామంలో బందెలు దొడ్డి అజమాయిషీ చేయుటకు పాలికాపు మాష్టరు కావలెను. కనీసార్హతలు – వ్యాపారనిర్వహణలో విదేశాలనుండి మాస్టర్ డిగ్రీ లేదా వ్యవసాయ నిర్వహణలో ఇంజనీరింగు డిగ్రీ లేదా మరియు డిప్లొమా లేదా గేదెలు కాయుటలో పన్నెండేళ్ళ అనుభవం.

తం : అబ్బాయ్! ఇది ఉద్యోగమేనా ?

కా : వయోపరిమితి ఇరవై రెండు సంవత్సరములు. విదేశాలలో పశువులుకాసినవారికి వయో పరిమితి అనుభవం సడలింపబడును. మూడుపూటలా పేడ తీయవలెను. పిడకలు చేయవలెను. పొట్టి పొడుగూ తేడాలేకుండా కొమ్ములుచేత పొడుపులు పడవలసియుండవలెను.

తం : బావుంది.

కా : పోట్లు పశువులను అదుపుచేయుటలో అనుభవ మున్న మంచిది. ఇదివరలో ఎప్పుడూ పొడు పులు పడిన జాడలేదని పశువుల వైద్యులనుండి

సర్టిఫికెటు జతపరచవలెను. పశువులు పట్టిపోయి
నను పాలుతీయగలిగి యుండవలెను.

తం : అబ్బాయ్! ఇక ఆపరా! మనకింక ఉద్యోగాలు
వేటవద్దు. కానీ! అప్పుకోసం ఆ బ్యాంకుఫారాలు
నింపు బూటుపాలిష్ కొట్టుపెట్టుకుందాం.

(సంగీతసభలో చిగురున మృదంగతాళ
విన్యాసంతో తప్పట్లు వినబడతాయి)

లోపల నల్గురూ : ఆహా! ఏంపాట! నల్లా ఇరుక్కు-. బాగుంది.

బయట అధ్యక్షుడు : ఏమిటీ! అప్పుడే కచేరీ అయిపోయిందా! అయితే అంతా నా కోసమే ఎదురుచూస్తున్నట్లున్నారూ !

వలంటీరు : పర్వాలేదులెండి. మీరు రెండుముక్కలు కచేరి గురించి చెప్తే సరిపోతుంది.

అధ్య : ఆ(అబ్బాయి! వలంటీరు! ఏమేం కృతులు విన్నావు. నేనిప్పుడే వచ్చాను....మరి నాకేం తెలీదే.

వలం : ఆ(యిందులో ఏముందండీ; రెండు ముక్కలు చెప్తే పోలే. (లోపలకెళ్ళి) అయ్యా! సర్వకళా నిలవసభ తరపున అధ్యక్షులవారు రాగబ్రహ్మం గారిగురించి మాట్లాడ్తారు.

అధ్యక్ష : సంగీతభక్తులారా (నెమ్మదిగా) దండలు దండలు. ఆహా(దూరంగా రాగబ్రహ్మంగారి పాట విన్నాను. ఏమిగాత్రం. మనసు గాలిలో తేలి పోయింది. ఏమి పాడారో, మరచిపోయాను. ఏమి శారీరం ఆ గొంతులో ఎన్నిస్వరాలు, ఎన్ని గమకాలుపలికాయి. ఆహా! ఎంతశుద్ధ అని 'బిందినిండిన రాగంలో వారు పాడుతుంటే మనసు ఎంత తత్తరపడిపోయిందో! ననుపాలింప అంటూ మదనరాగంలో వారు ఆలాపిస్తూవుంటే త్యాగ రాజు హృదయం ఎంత తొట్రుపడిందో అర్థమయిపోయింది. గసబిసకన్నడలో నినువినా

రాగబ్రహ్మంగారు వినా యింకెవరు పాడగలరు. కర్నాటక సంగీతం ఇంకా తామర లాగపాకాలి. మీరు శ్రోతలు యిందుకు చేయూత నివ్వాలి. చేతనయినంత చేతబడి మేంచేయాలి కాదనను (తప్పట్లు) మహాజనులారా! ఇప్పుడు కార్యదర్శి సన్మానపత్రం చదువుతారు.

కార్య : రాగబ్రహంగారికి సన్మానపత్రం. గంభీరగాత్ర వరేణ్య! మీగొంతు అనుపమానం. మీగాత్రం అనితరసాధ్యం. ఓనెరవల్ చక్రవర్తీ! మీరువేసిన వక్రనెరవలు కర్ణాటకసంగీతానికే కంఠాభరణం. గమకగంధర్వ! మీరు పాడే కష్టావిధగమకాలు ఉత్కృష్టగాయకులకు సహితం రసపట్టు. నికృష్ట గాయకులనుమాత్రం పగబట్టు. ఆహా! భావగాన మురబ్బా! స్వరలాహిరిలోల! మీ గాత్రంలో పలికే స్వరాలు చిట్టస్వరాలు దక్షిణాత్య విద్వాంసులకే ఉస్కో! అకారసాధకా! కుంచితనాద మునీ! ఇవే మా సన్మాననీరాంజనాలు అందుకో! పరకాళధ్వనులు. పరకాళధ్వనులు (తప్పట్లు) ఇప్పుడు మన ముఖ్యఅతిధి గాననాశనంగారు రాగబ్రహ్మంగారికి బిరుదు సమర్పిస్తారు.

గా. నాశనం : రాగబ్రహ్మంగారు టాంజోరులో విద్య నభ్యసించారని తెలిసింది. టాంజోర్ కళలకు పుట్టినిల్లు.

త్యాగబ్రహ్మకు మెట్టినిల్లు. రాగబ్రహ్మంగారి గాత్రాన్ని నేను వరండాలో నించుని విన్నాను. ఎన్న పురందరదాసర్ పాడళ్. రాగమూ భావమూ కలసి పాడటం చాలాకష్టం. అందుకే భావబ్రహ్మ అనే బిరుదు రాగబ్రహ్మంగారికిచ్చి మేము గౌరవించుకొంటున్నాం. ఈ శాలువా పోట్టిదేకాని, మా అభిమానం చాలా గట్టిది. నా తుది కోర్కె ఒక్కటుంది. అప్పదూరుకులోనయితినే అనే జావళి పాడమని రాగబ్రహ్మంగారిని కోరుతున్నాను. (తప్పట్లు)

రా. బ్రహ్మ ; అయ్యా! మీరు నన్ను మన్నించాలి. నా కసలు గాత్రం రాదు. నేనెప్పుడూ పాడలేదు. వేణువు వచ్చునండి. కావాలంటే వాయిస్తాను. (అప్పదూరుకులోనయితినే - అని వేణుగానం వినపడుతుంది.)

ఒకడు : ఆఁ ఏదోయ్! ఆ దినపత్రిక యిలా ఇవ్వు, ఊఁ....నలభై శాతం న్యూస్ప్రింటు కొరతఅయితే పేపర్లో పేజీలకు కరువువచ్చినట్లే

తిండినాధం : (హోటల్లో బోర్డు చదువుతూ) ఇడ్లీ ఉదయం ఆరుగంటల వరకూ మాత్రమే. ఆహా! ఆహా! ఇదిగో వాసినపోలయ్యగారూ! ఇడ్లీ విహారుకు

యింత దుర్దశపడుతుందని కలలో కూడా అనుకో లేదండి. ఉదయం ఏడుగంటలు కాకుండానే 'యిడ్లీ బందు' అంటే ఎలాగ చెప్పండి. చూడండి. నా రెండు ఇడ్లీ నాకు పారేసి పెసరట్టు చెప్పండి.

వాసినపోలయ్య : ఏంచేయమంటారు సార్! ఇడ్లీపిండి విదేశాల నుండి రావాలాయె. తొమ్మిదిదాటితే యీగలు కూడా రావటం మానేసాయ్. (వెనకాలనుండి పెసరరోస్టు అని వినపడుతూ వుంటుంది.)

తిండినాధం : ఇడ్లీ పిండికి యింత యిబ్బంది ఏమిటండీ! మీ రేదో మతలబు పెడ్తున్నారంతే!

వాసినపో : పాతికసంవత్సరాలగా ఇడ్లీపిండి దిగుమతి చేసు కుంటున్నాంసార్. గత రెండునెలలబట్టీ కటకట లాడిపోతున్నాం. మొన్న మళ్ళీ ముప్పయిశాతం కోత అన్నారు. పైగా గడిచిన ఏప్రియల్‌నుండి ఈ కోత అమలులోకి వస్తుందట. అంటే నూటికి 60 వంతులపైన కోత అన్నమాట. ఇదివరకు మా హోటలులో రోజుకి ఎనిమిది వాయలు దిగేవి. ఈ ఇబ్బంది వచ్చాక నాలుగువాయలు దింపుతున్నాం. ఇప్పుడు ఈ కోతను బట్టిచూస్తే అరవాయి ఇడ్లీకూడా దిగదు. తిండినాధంగారూ! రెండుపూరీ పార్సిల్ కూర సెపరేట్

తిండినాథం : నాకు తెలుసులేండి. ఇడ్లీకి రేషను పెట్టారు. మిగతా సామాన్లు అమ్ముకోవచ్చని.

వా. పో : అయ్యా! శివరాత్రి జాగరం తర్వాత రోజు వచ్చిందంటే ఉదయాన్నే తొంభై వాయలు తీసేవాడిని. ఇప్పుడో అసలు పండుగలకు ఇడ్లీలు వేయొద్దని పైనుంచి ఆర్డరు వచ్చింది. సాయంకాలం ఇడ్లీలు వేస్తే గిన్నెలు లాక్కొని పోతున్నారు. ఏడుదాటి యిడ్లీ కనబడితే రెండింతలు పన్ను కట్టాలటండీ. చాలా హోటళ్ళు యిడ్లీలు దొరకబడవు అని బోర్డులు కట్టారుసార్! ఇడ్లీలు వేసి అమ్ముకొనేవారంతా జంతికలలోకి శనగఉండల వ్యాపారంలోకి దిగిపోయారు. ఇడ్లీ తినండిసార్! కారప్పొడిలో నెయ్యి పేరుకు పోతోంది.

తిం. నా : తింటాను తింటాను కానీ! యిన్నాళ్ళు మీ ప్రొప్రయిటర్లు ఎలా ఊరుకున్నారయ్యా!

వా. పో : ఏంచేయమంటారు సార్! మేమంతా అర్జీలు పెట్టుకుంటూనే ఉన్నాం. దేశమంతా యిడ్లీమాస్టర్లు ఊరేగింపు చేసారు. వినేదెవరు స్వామీ! తినండి. ఇడ్లీ తినండి. ఈలోగా అట్టు కాలిందేమో చూసి వస్తాను.

తిం. నా : అలాగే – అలాగే....

వా. పో : అయ్యా! రండి రండి! రండి పిండిబ్రహ్మంగారూ, ఒరేయ్! ఐస్క్రీం తీసుకురా అయ్యగారికి. రండి కూర్చోండిసార్. ఉరేయ్ ఫేనెయ్యి.

పిండిబ్రహ్మం : ఏమిటండి వాశినగారూ! ఏడుగంటలయినా సరే ఇడ్లీ సప్లయి చేస్తూనే ఉన్నాను.

వా. పో : (నసుగుతూ) అబ్బే....—

పిండి బ్ర : ఎన్నిసార్లు చెప్పినా మీరు వినదలచుకోలేదు. అవునా! ఆహా! ఏమిటి అంట. ఏడుదాటి ఇడ్లీ సప్లయి చేసినందుకు మీకు వందరూపాయలు అపరాధం. అంతే కట్టాలి. ఏయ్ ప్యూన్. ఆయన ఎదురుగా వున్న యిడ్లీ ప్లేటు తీసేయ్ ముందు.

ప్యూన్ : ఎస్ సార్.

పి. బ్ర : ఇడ్లీలు తీసి సంచీలో వడేయ్.

ప్యూను : యస్. సర్.

పి. బ్ర : సంచీ సీల్ చేసేయ్.

ప్యూ : యస్. సర్.

పి. బ్ర : లోపల యిడ్లీ పాత్రలు లారీలో పడేయ్.

తిం. నా : ఏమిటండీ ఈ ఘోరం. తినే తినే యిడ్లీలు.

పి. బ్ర : మీకు అనవసరమండీ. రూలు ప్రకారం మాట్లాడ్తే మీరుకూడా ఫయిను కట్టాల్సి వుంటుందండి. ఏయ్! ప్యూను! తీసెయ్యవయ్యా! ముందర ఆ యిడ్లీప్లేటు ఆయనదగ్గిరనుండి తీసెయ్యవయ్యా.

ప్యూన్ : యస్. సర్.

తిం. నా : నా యిడ్లీ........

చిత్రప్రదర్శన



కార్యదర్శి : సభాసదులారా! ఈ నాడెంతో మంచిరోజు. ప్రపంచంలో ఎక్కడా జరగని చిత్రప్రదర్శన యిక్కడ ఒకటి ఏర్పాటు చేశాం. చిత్రారావు గారు వేసిన చిత్రాన్ని ఒకటితెచ్చాం. ఏంచిత్రం తెచ్చామో ఆయనకే తెలియదు. చిత్రకళా పిపాసులు చిత్రకళా ప్రేమికులు, చిత్రకళా విమర్శకులు కలసిన సభయిది. ఈ చిత్రాన్ని ముందుగా విమర్శకులు చూసారు. ఈ చిత్రం

లోని గొప్పతనాన్ని ముందుగా ఆ విమర్శకులే చెప్తారు. తర్వాత చిత్రావిష్కరణ జరుగుతుంది. చిత్రారావుగారు తమ బొమ్మని ఆవిష్కరిస్తారు ఇప్పుడు అంధచిత్రా ఆర్ట్సుకార్యదర్శి చిత్ర హింసగారిని ప్రస్తుత చిత్రంగురించి రెండు ముక్కలు చెప్పమంటున్నాను. రెండే ముక్కలు చిత్రహింసగారూ! (తప్పట్లు)

చిత్రహింస : మీరు కొద్దిసేపట్లో చిత్రాన్ని చూస్తారు. చిత్రంలో గడ్డిపోచల విసుర్లున్నాయి. గొప్ప రంగుల సూగుఉంది. అంటే ఎగరభోత అన్న మాట అంటే ఆకలిదప్పుల బాధలు చిత్రారావు గారు గొప్ప వర్ణాలలో చిత్రించారన్నమాట. దాని వెనక గొప్ప అనుభవం వుంది. ఇలా ఎన్నో ఆకలిదప్పులను అనుభవించి చిత్రారావు గారు యింకా ఎన్నో చిత్రాలను వేస్తారని ఆశిస్తున్నాను. ఇప్పుడు ప్రేతచిత్ర కళావిశార దులు చిత్రపయ్‌గారు నాలుగు ముక్కల్లు చెప్తారు (తప్పట్లు)

చిత్రపయ్ : ఆర్ట్ ఈజ్ లైను. లైన్ ఈజ్ ఆర్ట్. కలర్ ఈజ్ ఆర్ట్ చిత్రారావుగారి చిత్రంలో రంగురుచి వాసన అన్నీ ఉన్నాయి. ఆయనది అంతటి టేస్టు. మంచి మేధావి చిత్రం. కుంచె సహాయంతో చిత్రించారు. రంగుల సహాయంతో చిత్రించారు. ఏచిత్రం చూసినా ఈ ముక్కలే గుర్తుంచుకోండి. ఇప్పుడు శ్రీమతి ఖడ్గచిత్రగారు మాట్లాడ్తారు. (తప్పట్లు)

ఖడ్గచిత్ర : నా కార్టూంటే మా చెడ్డపిచ్చి. నేను బొమ్మలు వేస్తాను. ఆయిలులో వేస్తాను. నీటిరంగులలో వేయను. నీరు చౌక నూనెఖరీదు. కె. జి. పన్నెండు రూపాయలు. ఖరీదయిన నూనెరంగులు. ఖరీదయిన పటం. రిచ్ కాన్వాస్. భలే చిత్రించారు చిత్రారావుగారు. ఇట్ ఈజ్ ఎరిచ్ పెయింటింగు ఐ లయిక్ యిట్. తర్వాత చిత్రకంఠంగారు మాట్లాడ్తారు.

చిత్రకంఠం : ద్వంద్వార్థాలతో గీసిన చిత్రం లేదా రంగులతో చిత్రించిన చిత్రం రాదేమోనని ఇక అనుమానపడటం లేదనుకోవటంలో తప్పులేదనుకొంటాను. చిత్రారావుగారి బొమ్మ అలాంటి అనుమానం ఏదయినా వుంటే తీర్చివదనటంలో తప్పలేదు.

అధ్యక్షులు : చిత్రకంఠంగారు అర్థమయ్యేలా చిత్రంగురించి చెప్పారు. చిత్రంపైన ఉన్న తెర తొలగించి చిత్రారావుగారు తమ చిత్రాన్ని ఆవిష్కరిస్తారు. తర్వాత సభికులు ఏమయినా ప్రశ్నలు వేయవచ్చు.

చిత్రారావు : రసజ్ఞులయిన మీ ముందు నాచిత్రాన్ని ప్రదర్శించటం నా భాగ్యం. (తప్పట్లు) అరే ...అరే.... ఇదా.... ఇదీ.... ఇదీ....

చిత్రహింస : ఆ రంగులు అలాగే ఎందుకుండాలి ఈ....

చి. రావు : ఈ బొమ్మ .... నన్ను చెప్పనీయండి. ఈ బొమ్మ ....

ఖడ్గ చి. : ఆస్కా-య్ అలా ఎందుకుంది ? అది ఆకాశమా, భూమా!

చి. రావు : అమ్మో.

చిత్రపం : అదేంటి గింజలా! జపమాలా? నక్షత్రాలా?

చిత్రారావు : అయ్యో! నన్ను చెప్పనీయండి. నన్ను మాట్లాడనీయండి.

చిత్రకంఠం : అవి పూవులా? మరి ఇది నైరూప్య చిత్రంకాదూ!

చిత్రారావు : కాదుకాదు. అది నేను చిత్రించలేదు. రంగులు కలుపుకొనే పలక అది. బొమ్మకాదు. అవి రంగు ముద్దలు. జపమాలకాదు. ఆరని నూనె. అది ఆకాశంకాదు. అసలు అది చిత్రమేకాదు. రంగులు కలుపుకొనే అద్దంచిత్రంకాదు. అది చిత్రంకాదు.

సేవన్నగారికి సేవ

సేవన్న : అయ్యయ్యా! సర్వభక్షంగారూ నమస్కారం. నేను పూర్తిగా మారిపోయాను. మీరు చెప్పినదల్లా చేస్తాను.

సర్వభక్షం : మధ్యంతరం; మనం ఏమనుకుంటున్నామో! ఆయనకి తెలియచేయి.

మధ్యం : మీ జిత్తులు మాకు తెలియనివికావు సేవన్నగారూ!

సేవన్న : నేనెప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదండీ!

సర్వభక్షం : అటుకుల ఫ్యాక్టరీ కావాలని తమరు చేసిన సమాహార దీక్షలో వసూలు అయినటువంటి డబ్బుకు మీరు లెక్క చెప్పలేదు. మా వాటా మాకు అందలేదు.

సేవన్న : అబ్బే! అట్టే వసూలు కాలేదండి! జండాలకే చాలలేదండి. పైగా ప్రాక్షరసానికి అప్పుపెట్టవలసివచ్చింది.

మధ్యం : ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని మధ్యలో విరమించారు.

సేవన్న : ఎవరిప్రాణం వారికి తీపికదండీ!

సర్వ : ఆగష్టు ఒకటికి పని జరగకపోతే చెవి కోయించుకుంటామని అన్నారు.

సేవన్న : పని జరగలేదండి.

సర్వ : మరి చెవి ఎందుకు కోయించుకోలేదు.

సేవన్న : మీ మాటలు వినాలికదండీ! మరి చెవి లేకపోతే ఎలాగండీ!

సర్వ : మీకంత వేళాకోళంగా వుంది. హుం! అవతల ముఠాను దగాచేసి మాకు మేలు చేస్తామన్నారు.

మధ్య : మా డబ్బు తిన్నారు. వాళ్ళను దగా చేయలేదు సరికదా మమ్మల్ని మోసం చేసారు.

సేవన్న : ఎవరి స్వార్థం వారిదికదండీ! మరి.

సర్వ : అందుకే సేవన్నగారూ। మా దగ్గిర మీరు నిర్వహించగలపాత్ర ఏమీలేదు. దయచేయండి.

సేవన్న : అబ్బబ్బే। అంత మాటనకండి. మీరేమిచ్చినా చేస్తానంటున్నానుకదా।

సర్వ : గబ్బిలం నాయకులకు మా ఆస్థానంలో చోటు లేదండి. దయచేయండి. వెళ్ళండి. వెళ్ళండి.

సే : నేను చేసిన సేవలు మరచిపోతున్నారు ?

సర్వ : మరచిపోలేదు–కనుక నే మీకు పీకలమీదకు వస్తే చుట్టపీకల గదిలో చుట్టలిచ్చాం। సర్వ సౌకర్యాలు అమర్చాం.

సే : వఠి నే యిచ్చారా।

సర్వ : లేదు. లేదు. తమ సేవకులకు పించనుగా నెలకు రెండురూపాయలు ఇచ్చాం. అందమైన చెలి కత్తెను ఇచ్చాం. కారిచ్చాం. విదేశీ యాత్రలకు పాసు ఇచ్చాం.

మధ్య : తమరో–బైట కారుకూతలు కూసారు.

సే : మీరేకాదండీ। నా యిష్టం వచ్చినట్లు కూయమన్నారూ।

సర్వ : అంత వెర్రిగా కూయమనలేదే।

మధ్య : గ్రామాలలో విజృంభించిన పిడకల ఉద్యమాన్ని అణుస్తానని మాట ఇచ్చారుకదా.

సర్వ : అణచగపోగా సెగలుపొగలుగా ఉద్యమం చెల రేగింది. దానికి పట్నాలనుండి పెట్రోలు తెచ్చి పోసారని మాకు తెలిసింది.

సే : అదంతా పీడకల. మరచిపొండి. సర్వభక్షం గారూ! నాకేమయినా పని యిప్పించండి. మీ కడుపున పెట్టుకోండి నన్ను.

సర్వ : ఎందుకు చిచ్చు రేపటానికా !

సే : అమ్మమ్మ! అంతమాట అనకండి. విగతనాయకు డిని చింతచచ్చి వున్నాను. మీ కాళ్ళు పట్టుకుం టాను. నా కేవయినా పని యిప్పించండి. బ్రతక లేను బాబూ!

సర్వ : ఈసారి ఆడినమాట తప్పరుకదా!

సే : మీరేం చెప్పినా చేస్తాను.

సర్వ : ఇంక మారరుగా.

సే : మారను.

సర్వ : ఒరవై ఏళ్ళపాటు నా మాట వినాలి.

సే : తప్పకుండా వింటాను.

సర్వ : నా అధికారం వున్నంతవరకూ నా మాట వినాలి.

సే : అమ్మమ్మ! అలాగే! అలాగే!

సర్వ : అధికారంపోయినా నరే సహాయపడాలి.

సే	:	అలాగే. అన్నానుగా.
సర్వ	:	నేనేం చెప్పినా చేయాలి.
సే	:	తమవయ.
సర్వ	:	ఎదురు మాట్లాడకూడదు.
సే	:	చిత్తం.
సర్వ	:	ఇక్కడ కూర్చో అంటే ఇక్కడ కూర్చోవాలి. అక్కడ కూర్చో అంటే అక్కడ కూర్చోవాలి.
సే	:	అలాగే కూర్చుంటాను.
సర్వ	;	అయితే జైలులో కూర్చో.
సే	:	ఆఁ....
సర్వ	:	ఇదిగో మధ్యంతరం!
మధ్య	:	అయ్యా!
సర్వ	:	యావజ్జీవితం సేవన్నగారు, జైలులో వుండే ఏర్పాటు చూడు.



నాయకుల పొదుపు

(మితభుక్కు గారిల్లు. కోలాహలంగా వుంటుంది)

మితభుక్కు : రండి! రండి! నా సహచరులందరికీ స్వాగతం. మహాస్వాగతం. మనమంతా యిక్కడ ఎందుకు సమావేశమయ్యామో తెలుసుకద చదలయ్యగారు.

చదలయ్య : చిత్తం! విజాతీయకోళ్ళ సదస్సు విషయమై....

పంత	: ఊఁ పందికొక్కుగారూ! తమ రేమనుకుంటు న్నారు
పందికొక్కు	: మీ స్వగృహంలోని కోళ్ళ పరిశ్రమను చూచి ఆనందించమని తమరు మమ్మల్ని రమ్మనమని ఆదేశించారు.
మి. భు	: మాకు మా సహచరులకీ మధ్య అభిప్రాయ భేదాలు లేవు. మా కోళ్ళు సహచరులకోసం గ్రుడ్లు పెడతాయి. వాటికోసం మా సహచరులు ధనధాన్యాదులు గాదెలలో పోస్తారు. ఏమంటారు సేతులక్ష్మిగారూ!
సేతులక్ష్మి	: చిత్తం! వికేంద్రీకృతమై దేశమంతటా ప్రోగులు ప్రోగులుగా వున్న సంపదను వంతెనలా నిరంతరమూ తమకు అందజేసే తమ ధనదాసిని. తమ నిరంతర కటాక్షమే మాకు ప్రసాదం.
మి. భు	: దేశంలోని సంపద ఒకచోటే వుండి కుప్పలుగా అసహ్యంగా కనబడకూడదు. అవునా అతిమేత గారూ!
అతిమేత	: చిత్తం! అందరూ ఉపయోగించుకొనేవిధంగా సంపదలను తారురోడ్డులా పరచాలి. ఇతరుల సంపద మన జేబుల్లో వుండాలి.
మి. భు	: అదే పొరపాటు. ఇక మన ఆటలు సాగవు. అందుకే మనం భద్రంగా వుండాలి. మీకు

నచ్చినా నచ్చకపోయినా మనం పొదుపు నేర్చుకోవాలి.

అందరూ : మనమా! పొదుపా!

మి. భు : ఈ మాట అంటే మీకు గొంతుకదిగదు. నిజమే! కానీ తప్పదు. పొదుపుకోసం నాతో సహితం కొన్ని సూత్రాలు ఆచరణలో పెట్టాలి.

అందరూ : మనమా! ఆచరణా!

మి. భు : ఆ సూత్రాలు ఏమిటో చదువు తువ్వాయి.

తువ్వాయి : వివాహములలో భోజనము లుండరాదు. ప్రత్యేక పరిమితిపై నేతులు నూనెలు నదులవలె ప్రవహించవచ్చు. కరెంటు అసలు ఖర్చుపెట్టరాదు. అంతర్జాతీయ సభలు సహితం హరికెనలాంతరు వద్దనే జరుగవలెను. కార్లు వుపయోగించరాదు. పరిమితికి లోబడి పెట్రోలు వుపయోగించవలెను. నీటితోనే తరచు కారు నడుపవలెను. వారానికి ఏడురోజులు మాత్రమే విదేశములకు వెళ్ళవచ్చును. అంతకు మించి ఎట్టి పరిస్థితులలోనూ ఇతరదేశములకు వెళ్ళరాదు. బహుమతులు పుచ్చుకొనరాదు. బంగారము రూపములో అప్పులు పనికిరావు. వందరూపాయలు ఖర్చు అయ్యేచోట రూపాయమాత్రమె ఖర్చుపెట్టవలెను.

మి. భు : సహచరులారా! ఈ సూత్రాలు అమలుపరచటం కష్టంకాదు. ఇందుకు నా సహకారం ఎప్పుడూ వుంటుంది. ఇప్పుడు అసలు పనికి వద్దాం. మహాశిరా! అన్నీ రెడీయేనా!

మహాశిర : రెడీసార్! అన్ని కోళ్ళు ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నాయండి. అతిధులకు అన్ని ఏర్పాట్లు చేసాను సార్!

మితభుక్కు : అన్నీ గ్రుడ్లు పెట్టాయా!

మ. శి : పెట్టాయిసార్! ప్రతి కోడికి మంచి తివాసీ వేసాం సార్!

మి. భు : అగరవత్తులు వెలిగించావా!

మ. శి : బంగారపు గుత్తుల్లో వెలిగించానుసార్! సదస్యులందరికీ బంగారపు గ్రుడ్లు బహుమతిగా ఏర్పరిచాం సార్! ఆడవారికి పెంపకుంకుమ భరిణ ఎక్స్ట్రాసార్! మంచి డ్యాన్సుపార్టీ ఏర్పాటు చేసాసార్! బంగారు కోడి నమూనా బహుమతిగా పెట్టాం సార్!

మి. భు : వేదిక ఏర్పరిచావా!

మ. శి : షామియానా కట్టాంసార్! చుట్టూ దేదీప్యమానంగా బల్బులు పెట్టాంసార్! ప్రత్యేక మోటార్ల

మీద కరెంటు నడిపిస్తున్నాను సార్! 50 గ్యాలన్ల డీసెల్ ఆయిలు కొట్టాను సార్! ఐదువందల బస్తాల పంచదార తెచ్చాను సార్! ఐదువేలమందికి విందు సార్! ఐదురోడ్లు బంద్ సార్! ఏభయిలక్షల రూపాయల ఖర్చు అంచనా వేసాం సార్! మరో పదిలక్షలు ఖర్చుపెట్టాం సార్!

(పిల్లులు రెండురకాల గొంతులతో
గడబిడగా అరుస్తూవుంటాయి)

సమతలం : అర్ధమంగళం ఆ చీకటి బోనులో పిల్లులు యింకా
అలాగే అరుస్తున్నాయా!

అర్ధమంగళం : ఏంచెప్పను సమతలంగారూ! నాకో ఎలుకా నాకో ఎలుకా అంటూ మూలుగుతున్నాయండీ. ఈ జంతువులతో చెడ్డ చిక్కుగా వుందిసార్!

సమ : మరిన్నాళ్ళు నువ్వేం చేస్తున్నావ్!

అర్ధ : ఎంత నెమ్మదిగా చెప్పినా వినటం లేదండి. పురాణాలు వినిపించాం. పండితుల్ని పుసిగొల్పాం. అరుపులు మాత్రం మానలేదండి.

సమ : సినిమా పాటలు వేశావా?

అర్ధ : వినకూడని పాటలన్నీ వినిపించామండీ,

సమ : భోగరాజు కీర్తనలు పాడించావా.

అర్ధ : చిత్తం. క్షమశాస్త్రి కీర్తనలు కూడా వినిపించామండి. నిస్తేజరాగంలో నెరవలు చేసేమండి. బెసగలేదండి.

సమ : తాళం రెండుకాలాల నడిపించారా!

అర్ధ : చిత్తం. జాగా రెండు పదవులు విడిచి నమ్రగతిని రమ్మన్నామండి.

సమ : పల్లవి మారలేదుకదా.

అర్ధ : చిత్తం. మళ్ళీ అదేనండి. తండ్రీ నీవే దిక్కనుచు నే వేడ దానములీయవెవేగ-అంటున్నాయండి.

సమ : ఆఁ.... ఏమిటి పెద్దపిల్లి. తేడా అంటున్నావట. నీకేం చెప్పాను.

పెద్దపిల్లి : అబ్బే....ఏదో గతం ఆలోచించి అనాలికదండి. అందరిలోనూ పాడేవాళ్ళం.

సమతలం : గండుపిల్లి నువ్వు తేడా అంటున్నావుట.

గండుపిల్లి : ముందు కచేరీలు ఆలోచించాలి కదండి.

సమతలం : ఇంతకీ ఏమంటారు మీరు.

గండుపిల్లి : నా ఎలుకను నాకు అప్పచెప్పమంటానండి.

పె. పి : నా పాటా ఎలుక నాకిప్పిస్తే చాలుసార్!

సమ : అర్ధమంగళం యిన్నాళ్ళు నువ్వేం చేసావయ్యా?

అర్ధమం : 12 కే. జీల మాంసం బోనులో ఉంచానండి. అర గించమన్నానండి. జీర్ణం చేసుకోమన్నానండి.

సమ : భేష్ పిల్లులూ. మాంసం బావుందా.

అర్ధ : సమతలంగారు అడుగుతున్నారు చెప్పండి. మాంసం నచ్చిందా?

పె. పి : చాలా రుచిగా వుందండి.

గం. పి : మంచి మజాగా వుందండి.

అర్ధ : చెరో ఎలుకాకంటె యిదిబలమేనా?

పె. పి : అవునండి. దీనివలన మాకు క్రొత్తశక్తి వచ్చినదండి.

గం. పి : మా నీరసం ఎగిరిపోయిందండి.

సమ : చెరో ఎలుకా తింటె దుమ్ములుపోనూ మాంసం ఏముంటుంది?

పె. పి : నిజమేనండి.

గం. పి : మాంసం అసలు ఉండదండి.

అర్థ	:	అందుకే ఆలోచించుకోండి.
సమ	:	మీ మనసు కుదుటబడిందా !
గం. పి	:	చిత్రం.
సమ	:	అర్థమంగళం. ఇక చీకటిబోను తలుపు తీసెయ్య.
అర్ధ	:	అయ.
పె. పి	:	మీ మాంసం బావులేదు. నా వాటాగా వేరే ఎలుకనివ్వండి.
గం. పి	:	నా ఎలుక నా హక్కు.
పె. పి	:	మా ఎలుక మాది.
గం. పి	:	నా వాటా ఎలుక నా కిచ్చేయి.
పె. పి	:	నా ఎలుక నాది (అరుపులు)
సమ	:	అర్థమంగళం. పిల్లుల్ని మళ్ళీ చీకటి బోనులో పెట్టేయ్! మూతులు కట్టెయి.

(క్లాసుగది-కళాశాలలో)

అభ్యుదయం : సైలెన్స్. సైలెన్స్! ఇదిగో క్రిందటి క్లాసులో మనం విజ్ఞానప్రగతి గురించి మాట్లాడుకున్నాం. విజ్ఞానం మూఢనమ్మకాలను తొలగించడానికి ఉపయోగపడాలి. దేనినయినా ప్రశ్నించే హక్కు మనకి వుంది. సమాధానం రాకపోతే మనం దేనినీ నమ్మకూడదు.

గాయత్రి : ఎందుకు నమ్మకూడదు మాస్టారూ!

అభ్యు : మన అనుభవంలో లేదుకనకా

గాయత్రి : అంతమాత్రాన అది లేనట్టేనా?

అభ్యు : కూర్చోనువ్వు. మాట్లాడకు. సిట్ డౌన్. ఇదిగో గాయత్రీ నా ధోరణికి అడ్డురాకు నీకు చాలా సార్లు చెప్పాను. ఏం ముందుకు పోయేగతి సమాజానికి వుంది. దానిని అలా నడిపించే విధి మన అందరిదీను.

శంకరి : మాష్టారూ! కొందరు శకునాలను నమ్ముతారుకదా!

అభ్యు : బాగా అడిగావు శంకరం! నిన్ను నువ్వు మభ్యపెట్టుకోడానికి శకునం ఒక వంక. అది తప్పు. మీరంతా విజ్ఞానశాస్త్రంలో పట్టాలు తీసుకొనేవారు. శకునాలను నమ్మకూడదు.

శంకరి : మీరు నమ్ముతారా సార్!

అభ్యు : నేనా! నేను నమ్మను. పైగా నమ్మేవాళ్ళను పురుగులుగా చూస్తాను.

శంకరం : శాస్త్రీయంకాని కొన్నిటిని సాహిత్యం ప్రచారం చేస్తుంది కదండీ!

అభ్యు : నిజమే! అలా ప్రచారం చేయటం తప్పు. సాహిత్యం సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలి. వెనక్కి కాదే. ముందుకు ప్రగతివైపులాగనిది సాహిత్యంకాదు. మతం మూర్ఖం. ప్రార్థన బోగస్. పూజలు నాన్‌సెన్సు. దేముడు అబద్ధం. అంతా అజ్ఞానం. అదంతా అజ్ఞానం.

గాయత్రి : మరి విజ్ఞాన మేమిటండీ?

అభ్యు : ఇదిగో గాయత్రీ నువ్వూరుకో. సిడౌన్. విజ్ఞానం స్వచ్ఛమైంది. కంటికి కనబడేది. మూఢనమ్మకాలను త్రోసిరాజనేది. అభ్యుదయవాదులు విజ్ఞానవాదులవుతారు. నేను అలాటివాడిని. మన నిజజీవితానికీ బయటజీవితానికీ తేడా వుండకూడదు. చేసేదానికీ చెప్పేదానికీ పొంతన వుండాలన్న మాట. చెప్పేది ఆచారించాలి అన్న మాట. అప్పుడే ప్రగతి.

(క్లాసు అయిన గంట చప్పుడు)
(మరో దృశ్యంలో తలుపు తీసిన చప్పుడు)

అవతారం : ఒరేయి అభ్యుదయం! పూజ అయిందిరా!

అభ్యు : ఆఁ అయింది. ఇదిగో నైవేద్యం పెట్టి ఇలా వస్తున్నాను. దా కూర్చో! ప్రసాదం తీసుకో. శివాలయానికి వచ్చాను. కనబడలేదేం!

అవ : ఏంకనబడటం రా బాబూ!

అభ్య : ఏం ?

అవ : తలనొప్పితో చచ్చిపోతున్నాను. ముప్పయిరోజు లయింది. ఈ నొప్పి నన్ను వదలడం లేదురా!

అభ్య : సరే సూర్యనమస్కారాలు చేయించావా!

అవ : చేయించాను.

అభ్య : తాయెత్తు కట్టించావా

అవ : ఆఁ ఇక ఈబాధ నావల్ల కాదురా బాబూ!

అభ్య : ఛఛ! అలా అనకు! చూడు. ఒరే అవతారం. ఒక సారి నాకూ ఇలాగే తలనొప్పివస్తే ఎన్ని మం దులు వేసినా తగ్గలేదు. మా అమ్మ గుప్పెడు ఉప్పు చారెడు మిరపకాయలు తలచుట్టూ త్రిప్పి పారేసింది. అంతే నిమిషములో తగ్గిపోయింది. నిముషంలో.

అవతారం ; మరి అమ్మగారున్నారా! ఇప్పుడు

అభ్య : మా అమ్మ పురాణానికి వెళ్ళింది. వస్తుంది. కాసేపు కూర్చో.

అవ : అబ్బబ్బ! (బాధగా)

అభ్య ; కూర్చోరా!

ఓ.టి. గుమస్తా



ఆఫీసులో దృశ్యం - మానేజరు నిలబడి వుంటాడు.

ఆఫీసరు : ఏమిటండీ మేనేజరుగారూ! ఈ అచ్యుతం గుమాస్తాకు ఇంక బుద్ధిరాదా! అన్నిపనులు పెండింగు ఏమిటండీ. మీరేం చేస్తున్నారు!

మానేజర్ : ఏం చెప్పమన్నారు సార్! ఏమైనా అంటే నీ దిక్కున్నచోట చెప్పుకో అంటున్నాడు. రెండు నెలలపని బకాయిసార్!

ఆఫీ : చేయించుకోవటం చేతకాకపోతేసరి! ఓవర్ టయిమ్ వేసి చేయించుకోలేక పోయారా!

మానే : అదీ అడిగాను సార్! రోజుకు ఒక గంట ఓవర్ టైముకంటె ఎక్కువసేపు చేయనన్నాడండి.

ఆ : ఏం యింటిదగ్గర పెళ్ళాంతో కులుకుతాడా!

మా : కులుకులేదుసార్! ఎప్పుడూ అలకే!

ఆ : ఆహా! మరి మీరేం చేస్తున్నారూ!

మా : నాదికూడా.... అలక జాతకమేసార్!

ఆ : అబ్బబ్బ! అదికాదండీ! వాడిమీద ఏంచర్య తీసు కున్నారు అని! వాట్ యాక్షన్ డిడ్ యూ టేక్?

మా : ఓ. టి. కి. లొంగనివాడు కాటికికూడా లొంగడవి అంటారు నేనేమి చేయను సార్!

ఆ : సరే అతని తెగులు నేను కుదురుస్తాను. రేపటి నుండి రెండు నెలలపాటు అతనికి ఓవర్‌టయిము వేయి. యు మస్ట్ గెట్ ది వర్క్ డన్. సాయం కాలం ఆరుగంటలనుండి రాత్రి పన్నెండుదాకా ఓవర్ టయిము చేయమను. ఇంటికి వెళ్ళనీయకు.

కొగితాలన్నీ పూర్తి కావాలని చెప్పు. వారం రోజులలో నేను క్యాంపునుండి తిరిగి వస్తాను. ఈలోగా అచ్యుతం లొంగి రావాలి. వళ్ళు వంచి పనిచేయమను.

మా : చిత్తం.

(దృశ్యం ఎక్కడో తెలియకూడదు)

అచ్యుతం : ఈ మానేజరు ఎంతపని చేసాడూ! రాత్రి పన్నెండుదాకా నాచేత ఓ. టి. చేయిస్తాడా? నా కష్టం లేదంటే వినడూ! ఈ ఫైలు ఎంతకీ పూర్తి అయి చావదు.

రాజ్యం : రాత్రి పదకొండు దాటుతోంది. ఇక ఆ ఫయిలు కట్టిపెట్టండి.

అచ్యు : నీకేం. ఈ వారంలో పనులు జరగకపోతే ఆఫీసరు తిట్టిపోస్తాడు. మానేజరు మెమో తగలేస్తాడు. నువ్వెళ్ళి పడుకో. పిల్లలు పడుకున్నారా?

రాజ్యం : పంకా తిప్పి హాయిగా పడుకొన్నారు.

అచ్యు : (ఫైలు చదువుతూ) విత్ రిఫరెంసు టు యువర్ లెటర్ నో అండ్ నో వుమే బెగ్‌టుక్లియర్ ది సేమ్.

రాజ్యం : శేరుగిన్నె తెచ్చారా! నీళ్ళకు యిబ్బందిగా వుంది!

అచ్యు : శేరుగిన్నె దిబ్బగిన్నె! అపుకోరా! నిన్నే చూసుకోమని అఘోరించావా! అసలే నేను ఓ. టి. తో చస్తూ వుంటే.

రాజ్యం : టీ మాత్రం కావాలి. చాలీ చాలని గిన్నెలతో ఎలా ఏడ్చేదండీ!

అచ్యు : రాజ్యం! రాత్రివేళ వూరికే ఏడవకు! నాకు పని సాగటం లేదు. పోయి వెనకాల గదిలో పడుకో.

(ఆఫీసులో దృశ్యం ఆఫీసరు కూర్చుని వుంటాడు)

అచ్యు : నమస్కారం సార్! పిలిచారట.

ఆఫీ : ఏమయ్యా! అచ్యుతం! మీ ఆవిడను అలా కష్ట పెడుతున్నావ్!

అచ్యు : ఏం కష్టపెడుతున్నాను సార్!

ఆఫీ : నిన్న సాయంత్రం పాపం నీ భార్య మన ఆఫీసులో కుళాయినుండి మంచినీళ్ళు పట్టుకెళ్తోంది కూడా నీ పిల్లలున్నారు. నీ యిల్లెక్కడ? మన ఆఫీసెక్కడ? చాలా దూరం కదయ్యా!

అచ్యు : చిత్తం.

ఆఫీ : ఇల్లు మార్చేవయ్యా! సదుపాయం లేకపోతే!

అచ్యు : చిత్తం! మార్చేసానంతి.

ఆఫీ : మార్చావా! ఎక్కడికి! సౌకర్యంగా వుందా!

అచ్యు : బానే వుందండి. రెండు ఫ్యాన్లు మూడు కుర్చీలు.

ఆఫీ : భేష్! ఫర్నిచర్ అంతా వున్నదన్నమాట! ఎక్కడికి మారావ్?

అచ్యు : మన ఆఫీసులో స్టోర్సు గదిలోకండి.



కొత్త జీవితాలు

(మధ్యతరగతి ఇంటిలో ఒక దృశ్యం)

తల్లి : ఏమండీ! పెళ్ళి పదిరోజులు లేదు. పంచదార దొరకలేదుట! ఎంత మగపెళ్ళివారమయినా వాడకానికైనా లేకపోతే ఎలాగండీ!

తండ్రి : ఏమిరా మాధవా! కొట్టువా డేమన్నాడు!

మాధ	:	క్రొత్తకార్డు తెమ్మన్నాడు నాన్న
తండ్రి	:	రవ్వ, పంచదార, ఒక కార్డుమీదే యిస్తున్నాడు కదరా!
మా	:	నిన్నసాయంత్రంనుండి రూలు మారిందట. వేరే కార్డుపైనగానీ యివ్వరుట.
తం	:	మరి వేరే కార్డు ఎవరిస్తారు?
మా	:	తాలూకాఫీసులో కాగితం పెట్టాలిట!
తల్లి	:	మరి ఆకాయితం తేలేకపోయినావా!
మా	:	గోధుమలకార్డు చూపిస్తేనేకాని ఆ కాగితం యివ్వనన్నాడు.
తల్లి	:	ఈ పెళ్ళి పనుల్లో ఆ గోధుమల కార్డు ఎక్కడో మండపెట్టానండీ. నా మతిమండ.
మా	:	పోనీ పాలకార్డయినా యివ్వమన్నాడు. కానీ పని మనిషి పాలకార్డు తన యింటిదగ్గిర మరచి పోయింది.
తం	:	నాలుగు కాశీసీసాలు పట్టుకెళ్ళి "బాబూ! మేము దొంగలంకాం. ఆ కాగితం మా మొహాన తగలేయండి" అనలేకపోయావా!
మా	:	పోనీ బియ్యం కార్డు తీసుకురా! అన్నాడు నాన్న!
తం	:	మరిబియ్యం కార్డు ఎక్కడ పెట్టార్రా!
తల్లి	:	ప్రక్కింటి వనజమ్మగారు పట్టుకెళ్ళి యింకా యివ్వలేదండి.

తం : అఘోరించినట్లైవుంది.

తల్లి : పోనీ మంచినీళ్ళ కార్డువుంది. దానిమీద యిసా డేమో అడగరా అబ్బాయి!

మా : ఆ వెధవకార్డు నేను పట్టుకెళ్ళను. ఆ కార్డు బాల్చీకి అతికించి వుంటుంది. రోడ్డుమీద బాల్చీతో నేను వెళ్ళను బాబూ!

తండ్రి : ఏడవకు! పంచదార లేకపోతే పెళ్ళి ఆగిపోదు. బెల్లంతో వురేసుకుందాం.

తల్లి : బాగుండదండీ! మగపెళ్ళివారం బెల్లం కాఫీ యిస్తే అప్రదిష్ట కాదుటండీ!

(పెద్ద కొడుకు వస్తూనే)

పె. కొ : అబ్బబ్బ! ఈ ఆఫీసుల వెంట నేను తిరగలేను నాన్నా!

తం : ఇంతకీ కారు మాట్లాడావా!

పె. కొ : కొండ ఎక్కాలంటే కారుకి కార్డు కావాలట. పెట్రోలుకు వేరే కార్డు కావాలట. దారిలో భోజ నానికి కార్డులు తేవాలట. పెళ్ళివారందరికీ కార్డు లుండాలట. నేను పడలేను నాన్నా.

బుల్లి కొడుకు : నాన్నా నా మార్కుల కార్డుమీద సంతకం పెట్టవా!

తండ్రి : వుండరా! నీ గొడవ ఒకటి మధ్యలో! ఏరాపెద్దా! ఇంతకీ కారుకోసం కాగితం పెట్టావా!

పె. కొ : ఆ కాగితంతో మన బియ్యం కార్డు పట్టుకెళ్లాలిట! యింటి యజమానికూడా వుండాలిట.

తండ్రి : పోనీ నాకో మూర్ఛ బిళ్ళ మెడకి తగిలిస్తేసరి. ఈ బాధ వుండదు.

(వివాహం అవుతున్న కలకలం)

తండ్రి : కొండమీద పెళ్ళి కాదుకానీబావా! యమయాతనగా ఉందనుకో. ప్రొద్దుటే వేడినీళ్ళకు కార్డు తెమ్మ న్నాడు.. గుళ్ళోకి వెళ్ళే కార్డు. కొబ్బరికాయకి కార్డు. కొట్టడానికి కార్డు. కుంకానికి కార్డు. హార తికి కార్డు. అబ్బబ్బ చచ్చే బాధగా వుందనుకో!

బావమ : ఇంకానయం. సిగరెట్టుకొట్టువాడు కార్డు చూపించ మన్నాడు. నా బ్రాండుకి రేషను పెట్టారట. అదిగో కార్డుల యినస్పెక్టరులా వుంది చూడు!

కార్డుల యినస్పెక్టర్: ఎవరండీ? పెళ్ళికొడుకు తండ్రి?

తండ్రి : నేనేనండి.

కా. యి : పెళ్ళి కొడుకు కార్డేదండి.

తండ్రి : పెళ్ళికొడుక్కి కార్డా! ఆ పీటలమీద కూర్చున్నవాడే పెళ్ళికొడుకండి. మా వాడేనండి. ఇంజినీరండి.

కా. యి : అతనే పెళ్ళికొడుకని రుజువేమిటండి. ఇంజనీ రయినా డాక్టరయినా కార్డుండాలండి. కార్డు లేనిదే కుదరదండి. ప్యూన్!

("వెనక నుండి మాంగల్యధారణ తంతు వినబడుతుంది)

ప్యూన్ : సార్!

కా. యి. : భజంత్రీలను ఆపమను. పెళ్ళికొడుకును లెమ్మను. పీటలు తీసేయి.

(ఒడంబంగారికీ జై ... ఒడంబంగారికి జై ...)

ఒడంబం : ప్రజలారా! ప్రతిమనిషికీ కనీసం ఒక బంగాళా వుండాలని మా పరసేవా సంఘం తలపెట్టింది.

ఇందులకై కరెంటులేని గ్రామాలలో సహితం బంగళాలు కట్టిస్తున్నాం. చీమలబారుల్లాంటి బంగళాలే బీదదేశానికి అలంకారాలు. త్రాగటానికి గంజిలేకపోయినా సరే కడుపులో కాళ్ళు పెట్టుకొని పడుకోవటానికి వరండాలు ఎంత అవసరమో మీకు తెలియనిదికాదు.

(బంగళా మా జన్మహక్కు... వరండా మా కనీసహక్కు అని అరుపులు)

మహాప్రజలారా! మీహక్కులు సిద్ధించేరోజు వచ్చింది. గ్రామీణ భవనసంఘాలు వాడవాడలా ఏర్పడ్డాయి. ఆ గ్రామం చివరనుండి ఈ గ్రామం చివరదాకా డాబాలే. ఇక మీరు నేలమీద అడుగుపెట్టనక్కర్లేదు. ఈ డాబాల నిర్మాణానికి పునాదిరాయి వేయవలసినదిగా స్వామి శంకుస్థాపనగారిని పిలిచాం. ఆయన వెండితాపీతో సున్నంముడతారు.

(శంఖుస్థాపనస్వామికీ జై ... స్వామిూ శంఖుస్థాపన్ కీ జై)

శం. స్వా : వెండి చాలాగాయకం అయిపోయింది. అయినా సరే వెండి తాపీ ఇచ్చారంటే మీ రెంత శ్రద్ధగలవారో తెలుస్తోంది. ఇది నలభైయ్యో వెండితాపీ! నేను శంకుస్థాపన ఆశ్రమం స్వీకరించాక భవ

నాలవాడలో ఆరురోజులుగా శంకుస్థాపనలు చేస్తూవస్తున్నాను. ఎక్కడ చూసినా ప్రజలు చైతన్యంతో వుడికిపోతున్నారు. చైతన్యసమాధి లేనిదే మన ఆత్మలు శాంతించవు.

ఈ కుతకుత, ఈ వేడి, ఈ వుత్సాహం, లేనిదే మన జీవితాలలో మార్పురాదు. ఒకసారి మన బుర్రలు పాకలలోంచి రాజభవనాలలోకి మారనిదే విప్లవం రాదు. మీరు చేస్తున్నది కనీవినీ ఎరుగని భవనవిప్లవం. ఇది భువన విప్లవం కూడా. ఈ భవన విప్లవంవలన మనం చరిత్రలో నిలబడిపోతాం. పదిమైళ్ళ దూరంలోని గ్రామాలన్నిటినీ డాబాలతో కలిపివేస్తున్నారంటే నా ఆనందం గుల్ల సున్నంలా ఉడుకుతోంది. ఏనాడో భవననిర్మాణతీర్థులు గృహాంతభేరీలో మనవిచేసినట్లు పాలరాతిగచ్చుమీద, సిమ్మెంటు గిలాబాలలోనూ మాత్రమే తెలివి నృత్యం చేస్తుంది. మురుగు కాల్వల ప్రక్క పూరిపాకలలోనూ బుర్ర పురి విప్పదు. మీ భవనవిప్లవం గ్రామగ్రామాల తాలూకు తెగులులా అంటుకోవాలని కోరుకుంటున్నాం. ఇప్పుడు పునాదులరాయన్నగారు మాట్లాడ్తారు.

పునా. రా : సోదరులారా! రాగల వెయ్యి సంవత్సరాలపాటు గట్టిగా భవనాలు నిలవాలంటే మంజూరయిన

పదికోట్లలో ఎనిమిదికోట్లు రూపాయలు పునాదులలో వెచ్చించాలి. మిగతా రెండు కోట్లతో మొండిగోడలు తప్ప సాధ్యంకాదని శంకుస్థాపన స్వామివారికి మనవిచేసుకొంటున్నాను పని పేచీ లేకుండా పూచీగా సాగడానికి కొన్ని వుపసంఘాలను నియమించాం. ముందు సిమ్మెంటు ఉపసంఘం అధ్యక్షులు పైసల కైంకర్యంగారు మాట్లాడ్తారు.

పై. కై : స్వాములవారికి ఇవే మా ఖాళీ సిమెంటు సంచి దండలు. స్వామీ! సిమ్మెంటు చాల ప్రియమయి పోయింది. ఇదివరలో గ్రంధాలయానికి సిమ్మెంటు దొరక్కపోతే బూడిదతో గిలాబా చేయడానికి అనుమతించారు. తమ సెలవు మేరకు అలాగే గిలాబా చేసాం. గ్రంథాలయం చెక్కుచెదరలేదు. ఇప్పుడుకూడా బూడిదతో గిలాబా చేయడానికి అనుమతించ వలసినదిగా కోరుకుంటున్నాం. ఇప్పుడు సొమ్ముల తాపీగారు మనవిచేస్తారు.

సొమ్ముల తాపీ : స్వామిజీ! ఇలాటి బృహత్కార్యాలకు ఎంత డబ్బయినా చాలదు. చేతులు కడగటానికి తడి ఖాతాక్రింద కోటిరూపాయలు కేటాయించమంటున్నాను. ఆ తడి వదలటానికి సబ్బుకాతాక్రింద అరకోటి రూపాయలు ఇప్పించమంటున్నాను. ఇక నీటిమట్టంగారు నాలుగు మాటలు చెప్తారు.

నీటిమట్టం : స్వామిజీ! మురికి తిన్నగా పారినదీ లేనిదీ చూడాలంటే నమూనా కాల్వలు త్రవ్వాలి. అత్యధిక మురుగు ఎంత వుంటుందో అంచనా కావాలి. అందుకే మురుగునీరు కావాలి. డ్యారేజి కావాలి. కాలువలు ఉన్నా మురికి లేకపోతే ఇబ్బంది కలుగుతుంది. అందుకని మురుగు నీరు దిగుమతికి, డ్యారేజికి, నమూనా కాలువలకి కోటి రూపాయలు ఇప్పించమంటున్నాను.

స్వామి : వో! అలాగే కానీండి.

(బంగాళా మూ జన్మ హాక్కు--వరండా-- మూ కనీస హాక్కు)

(రామన్నగారిల్లు)

ఓదంబం : అయ్యోయ్యో! కొంప మునిగిందిగదండీ! పునాదుల రామన్నగారూ! కొంప మునిగి పోయింది. మనం డబ్బంతా కాజేసామట. మనం ఇళ్ళు కట్టలేదట. నిజానిజాలు తేల్చడానికి ప్రభుత్వం సంఘం నియమించినదట. ఇవాళే ఆ సంఘం మన వూరు వస్తుందట.

పునా. రా : చంపావ్! ఆ స్థలం అంతా మురికినీటితో నింపేయి. పునాదిరాయి తీసేయి. అక్కడక్కడ

నావరాళ్ళు కనబడేలా నిలువుగా పాతు. నాలుగు మూలలా శిబిరాలు వేయి. స్మశానస్థలం త్రవ్వ కూడదు అని బోర్డు రాయి. మురుగునీటిని పోని వ్వకు. కూలీలను పెట్టు. సంఘం వెనక్కి పో. సంఘం గోబ్యాక్ అని అరపించు వెళ్ళు

చౌకరాజ్యం

వెంకట్రావు : అబ్బాయ్! అన్నిరాజ్యాలు చిన్న-పెద్ద ఏకమవుతే కాని మన దరిద్రం తీరదురా.

శంకరం : రోడ్డుమీద ఎందుకు బాబూ! ఈ కబుర్లు! పాతిక సంవత్సరాలు ఐక్యరాజ్యసమితిలో పనిచేశావు.

ధరల నిలకడ సంఘం నిపుణిగా వున్నావు. ఒక్కపని చేయగలిగావా! చౌకరాజ్యం తేవడమే ధ్యేయమన్నావు కుదిరిందా !

వెంక : ప్రచ్ఛన్న యుద్ధంవచ్చి మా పథకాలని పాడు చేసిందిరా శంకరం. అయినా ఉప్పుధరని అదుపులో పెట్టింది మేము. గాలిని అమ్మే ప్రయత్నాలను వమ్ముచేసింది మేము.

శంక : ఊఁ ప్రస్తుతం ధరలని అరికట్టలేం. ఎందుకు వచ్చిందిలే బాబూ! ఇదంతాను.

వెం : ఆఁ.... అలా ... అనకు శంకరం! పెద్ద చిన్నా దేశాలు కలిస్తే ధరలు పడిపోతాయి. కట్టచుట్టలు పైసా. వంద పెసరట్లు రెండు పైసలు. నా కళ్ళలో చూడు నవ్వు.

శంక : విదేశీ సుందరులు కనబడతాయా! వెంకట్రావు బావా !

వెం : మహా సంక్షేమరాజ్యం కనబడుతుంది. కారు చౌకరాజ్యం కనబడుతుంది. నేను కలలుకన్న రాజ్యం. అతిచౌకరాజ్యం కనబడుతుంది చూడు. చూడు నా కళ్ళతో చూడు.

(చూస్తున్నట్లు దృశ్యం)

వండోరా : రండిసార్ రండి కొనండి. మంచి దుస్తులు సార్! మంచి మంచి వస్త్రాలు సార్! మీటరు క్లాతు రెండు పైసలు. ఓన్లీ టూ పైసే. ఫారిన్ నైలక్స్ చీర అర్ధరూపాయి. పిల్లల డ్రాయర్లు వందమూడుపైసలు. పది జేబురుమాళ్ళు ఒక్క- పావలా సార్! ట్వినుపూల్సు వెడ్డింగు సూటింగ్ మీటరు పదిపైసలు సార్. ఓన్లీ పది పైసలు సార్! బెనారసు పట్టుచీర ఒకే ఒక్కరూపాయ. ఇంకా అరణి పావలా - ధర్మవరం దస్ పైసా- అమ్మారండి అయ్యారండి. కారుచౌక కారు చౌక.

(కారు స్పీడు తగ్గి ఆగుతుంది)

శంకరం : ఒరే అచ్యుతం ఆరురూపాయలు తగలేసి ఈ పెయ్యమూతి చిన్నకారు కొనేకంటె పదిరూపా యలు తగలేసి పందిమూతి కారుకొంటే బాగుం టుంది కదరా!

అచ్యుతం : ఇంకా ధరలు తగ్గుతాయిరా. ఆ పెద్దకారు మూడు రూపాయలకే వస్తుందట. అది సరేకాని ముందు ఈ రెండుపైసలు పెట్టి రెండు బాల్కానీ టిక్కట్లు కొను.

ప్యూను : సార్! బియ్యం నాలుగు బస్తాలు ఇంటిదగ్గిర వేయించాను సార్! నాలుగు రూపాయలయింది.

అర్ధరూపాయి పెట్టి బస్తా పంచదార కొన్నానండి. అయిదు పైసలు పెట్టి ఇరవై కే జీల కాఫీగుండ కొన్నానండి. పదిపైసలు పెట్టి వెయ్యి బత్తాయిలు కొన్నాను సార్ !

అచ్యుతం : మిగిలిన ఇరవైపైసలు బ్యాంకులో వెయ్యి. నువ్వు పో.

ఆనందం : హల్లో అచ్యుతం ! ఏమిటో యిల్లు కొన్నావటగా ! ఎంతయింది ?

అచ్యుతం : అవును ఆనందం. గవర్నర్ పేటలో ఒక మేడ కొన్నాను. వందరూపాయలు. రెండువేల గజాల స్థలం. మేము ఉండగా రెండు రూపాయలు అద్దె వస్తుందనుకో.

ఆనందం : అబ్బా ! అంతా పెద్దదా !
ఆః సరేకానీ ! మీ అమ్మాయి పెళ్ళి కుదిరిందటగా. ఎంత కట్నం.

ఆనందం : అవును బ్రదర్. కుర్రాడు డాక్టరు. పదిరూపాయలు కట్నం. ఆఁ కొంచెంఎక్కువే అనుకో. పై ఖర్చులు మరో అయిదు రూపాయలు వేసుకుంటే నీ ధర్మమా అని గట్టెక్కిపోతాం.

అచ్యు : మంచివాడవే ! ఆఁ .... అవును కానీ ! ఈ బొమ్మ ఎలా వుందంటావ్ !

ఆనందం : పిక్చర్ కలర్‌లో తీసారు. అంతా కలిపి రెండు వేలయిందట. బంపర్ కలెక్షన్. రోజుకి పద్దెనిమిది రూపాయలు హవుస్‌ఫుల్. ఆఁ....

(కల అయిపోయిన ధ్వనులు)

వెంక : నాలోకం అంత కారు చౌకగా వుంటుంది. ఆఁ ఎండ ఎక్కువగా వుంది. గొంతు తడారిపోయింది. కాస్త బత్తాయిరసం త్రాగుదాం. ఆకొట్టుకు పద....

శం : పదమరి.

వెంక : నాయనా ఓ గ్లాసు బత్తాయి రసం యివ్వవు బాబూ!

కొట్టువాడు : మూడురూపాయలు సార్.

శం : అదేమిటయ్యా!

కొ. వా : బత్తాయిలు దొరకటం లేదండి.

వెం : ఊఁ రెండు కూలు డ్రింకులియ్యి పోనీ.

కొ. వా : అయిదు రూపాయలు సార్!

శం : ఏమిటయ్యా!

వెం : పోనీ గ్లాసెడు మంచినీళ్ళియ్యి.

కొ. వా : దొరకవండి. పొరుగూరికి డిగుమతి చేయాలనీ వాడకం ఆపేసారండి.



రామం : లక్షసార్లు చెప్పాను. నీ ముచ్చట్లు తీర్చడానికి నాదగ్గిర డబ్బుల్లేవని. నీ చీరెలు, సారెలూవల్ల నా జీవితం హారతికర్పూరం అయిపోతోంది.

జానకి : నా దగ్గిరకొచ్చేటప్పటికి అన్నీ ఆఖరవుతాయి. నేనేమయినా బెంగుళూరు చీర కావాలని ఏడ్చానా? కంచిపట్టు కావాలని మంకుపట్టు పట్టానా? వెధవది సాదా వాయిలుచీరకోసం ఇంత రాద్ధాంతం చేస్తారా.

రామం : ఆ వెధవ సాదావాయిలు చీర డబ్బయిలో నీలుగు తోంది. చీరతో ఆగుతావా ! మ్యాచింగు జాకెట్టు మరో పదిహేనుకు దేకుతోంది. మొత్తం వంద క్షవరం. నీ సాదాచీరల ఖర్చు ఐదువందలవు తుంది–ఇదిగాక నీ పుట్టినరోజుకు పట్టు చీర, నా పుటినరోజుకి తెల్లచీర. మన పెళ్ళిరోజు సంబ రానికి ప్రింటుచీర, పిల్లాడు పుట్టినరోజుకి నీకు పుల్లేటికుర్రు చీర, వాడు ఏడ్చిన రోజున కట్టుడు చీర – ఈచీరల సంసారం నేం చెయ్యలేను. నీకో నమస్కారం. నాకో కాఫీ తగలెయ్యి. క్యాంపుకి పోవాలి.

జానకి : చీరెలు కొనుక్కొనేవారు జాకెట్టు కొనుక్కోరూ. అడిగేసరికల్లా అరచి చీరలు వోణీలు చేసి పెడ తారు. మీ అప్పగారు మూడుసార్లు వస్తే మూడు సార్లూ జరీచీరెలు పెట్టలే. మీ చెల్లాయికి టపాలో చీరలు చదివించేరే. వాళ్ళపాటి నేను చెయ్యనూ.

రామం : అబ్బబ్బ – జానకీ....

జానకి : పైగా సంసారం చేయలేనని నమస్కారాలు పెడ తారా ? అసలు నమస్కారం పెట్టాల్సింది నేను. ప్రొద్దుటే పాలసీసాల లారీ చప్పుడైంది లగా యతు రెండవ సినిమా మొదలయ్యేదాకా మీ సేవ చేస్తున్నానే: గెడ్డానికి వేడినీళ్ళు, ఎనిమిదిలోగా నాలుగుసార్లు కాఫీలు రోజుకి రెండుసార్లు టిఫెన్లు స్నేహితులకు సేమియాలు, రాత్రికి వేపడాలు, పెరుగు పచ్చళ్ళు–నే నేమయినా మీ వంటదానినా? దండెం బట్టలు గుంజుతున్నాను – రెండు పుంజీ కప్పులు కడుగుతున్నాను – చాకదానినా ! దాసీ దానినా ! నేనూ ప్యాసయ్యాను–బియే.

రామం : ఆపు. ఇక దండకం ఆపు. చదవకు. తాళి కట్టించుకున్నావో చేస్తావు. నాకోసం చేస్తున్నావా. నువ్వా తినాలి చేస్తున్నావు. బియే చదివిన దాసీ గారూ కాఫీ యిస్తారా!

జానకి : (లోపల) ఎంత ముక్క అన్నారూ! నాతో సరసాలాడకండి. ఇదిగో కాఫీ తీసుకోండి ....

రామం : నువ్వెప్పుడొచ్చావోయ్ ...... శంకరం .... మీ అక్కేదీ? బజారు కెళ్ళిందా? జానకీ!

శంకరం : ఇప్పుడే జావా .... లోపలుంది.

రామం : జానకీ ఇదిగో నా వాయిలు చీర.

శం : అక్కరలేదుట.

రామం : నీకాక్కదులేవోయి.

శం : అక్కకే వద్దట.

రామం : నువ్వెవరవోయి చెప్పడానికి?

శంక : మా అక్క ప్రతినిధిని. ఈ చీరల వంచనలతో సినీమాల మోసాలతో నీవు భార్యలను జయించలేవు.

రామం : భార్యలు అంటే వేమిటోయ్. కొంప తీస్తావు జానకీ!

శంకరం : అడుగు ముందుకు వెయ్యకు. నాతోనే సంప్రదించు. మా అక్క కోర్కెలు తీర్చు.

రామం : ఒహో అలా ముదిరిందా .... అయితే ఏమిటి మీ అక్కగారి కోర్కెలు?

శం : ఒట్టి కోర్కెలు కాదు. కనీస కోర్కెలు.

రామం : సరె. అయితే ఆవిడనే చెప్పమను.

(ప్రభువులం మేం వింటాం)

జానకి : మేం బి. ఎ. చదివిన దాసీలం అని ప్రభువులే ఒప్పుకున్నారు గనక ప్రతినెలా రెండవ తారీఖున నెలకు మూడువందలు బ్యాంకులో నా పేరన జమ కట్టాలి. బట్టలుతికినందుకు రెండు చీరలుగాని వందరూపాయలు బత్తెంగాని యివ్వాలి. షికారుకి చీర బోనస్‌గా యివ్వాలి. మూడవసారి కాఫీ కలిపితే ఓవర్ కాఫీ ఎలవెన్సు యివ్వాలి. పెసరట్టు ఫలహారాలయితే రుబ్బు ఎలవెన్సు ఇవ్వాలి. ఇడ్లీ అయితే తప్పాళా ఎలవెన్సు యివ్వాలి. వంట ఇంట్లో పని ఎనిమిదిగంటలే వుండాలి. వారానికో రోజు వేరే శెలవు యివ్వాలి. ప్రతి సంవత్సరం పుట్టింటికి నెలరోజులు పంపాలి. ఈ బత్తాలు, సొమ్ములు ప్రతినెల రెండవతారీఖున బ్యాంకులో వేయాలి. గతనెలనుండి బకాయిలు జమకట్టాలి.

రామం : అన్యాయం. ఈ కోర్కెలుమ నస్మృతిలోలేవు.

జానకి : నా స్మృతిలో వున్నాయి.

రామం : ఈ కోర్కెలకు సమ్మతించకపోతే.

జానకి : ఈ పూటనుండి వంటిల్లు బంద్. పొయ్యి వెలగదు.

రామం : అలా అనకు జానకీ ! నీకు ఎన్నో సౌకర్యాలు ఏర్పరిచాను. సినిమాకి వెళ్ళడానికి స్వాతంత్రం ఇచ్చాను. పాతజరీమీద చిరుగు చీరలపైన హక్కు నీది. పాత కాగితాలమీద రాబడి నీది. ఇంతకంటె నావల్ల కాదు.

జానకి : శంకరం రిక్షా పిలవరా! పోదాం–నాన్నదగ్గరికి

శంక : బావా! ఒప్పేసుకో! లేకపోతే గ్యాస్ వెలగ పెరుగు తోడుకోదు. కడుపులో కాఫీ పడదు.

రామం : సరే నీ మాటే కానీయ్ జానకి.

జానకి : బకాయిలన్నీ రేపే జమకట్టాలి. ఇదే మన ఒ బడిక. భోజనానికి లేవండి.

శం : చదువుకున్న భార్యలు జిందాబాద్!

— — — —

శం : అక్కా– అక్కా– (తలుపు చప్పుడు)

జానకి : వచ్చె! వచ్చె!

శం : తలుపుతీయ్ (తీసిన చప్పుడు)

జానకి : మీ బావగారేరా....

రామం : అమ్మా! కాస్త పాతగుడ్డ పడేయండమ్మా! అ దోడ్డి తల్లీ!

జానకి : అయ్యయ్యో ఇదేమిటండీ! ఇదేం అవతా మండి ఆబనీనూ మీరూ – అయ్యయ్యో....

రామం : ఏం చెయ్యను జానకీ! మన ఒడంబడిక ప్రకార నీ జీతం మూడొందలు, వంట బత్తేలు ఐ వందలు, ఓపర్‌టయిము అలవెన్సులు రెం వందలు చీర అడ్వాన్సు ఏభయి అన్నీ నీ పే జమకట్టేక ఇలా అయ్యాను. కాస్త పాతగు ఉంటే ఇలా పడేయండమ్మా–అనాదోడ్డి–

This page intentionally left blank

RADIO CHELUKULU

By P. Subrahmanya Bhattu   Price : Rs. 3-00

ఈపుస్తకం రుచి

"ఏముద్దుకు ఆ ముద్దే.... హెల్దీ హ్యూమరు. మెదడుకు మేత.... గ్రాస్‌నుంచి గాడ్‌వరకూ ఏయితివృత్తం తీసుకొన్నా రసవత్తరమైన హాస్యసృష్టి.... వీరి జోకు నాజూకుగా వుంటుంది.... వీరి సరసం తమలపాకుతో– తలుపుచెక్కతో కాదు; పన్నీరుజల్లు, పల్లేరు ముళ్ళు కావు: ఈయన హ్యూమర్‌లో పెర్‌ఫ్యూమ్ వుంది....

మాటలకు పొటన్సీ పొదిగి మంత్రించి ప్రయోగించినాడు. డైలాగ్స్‌లో ఒక్క వ్యర్థపదంకూడా లేదు. అంత కట్మస్తీగా బిగించారు. రచనంతా సుపర్బ్‌గా వుంది.

—పుచ్చా పూర్ణానందం.

హాస్యం– ఆరోగ్యకరమైన హాస్యం– ప్రౌఢవయస్సు లక్షణం. పెరిగిన మనిషి చిన్నపిల్లవాడుగా నటిస్తూ, తన్నూ, తన సాటివారినీ వేళాకోళం చేయడంలోనే అటువంటి హాస్యం పుట్టుకొస్తుంది. ఈ చెణుకులలో ఆ లక్షణం కనిపిస్తుంది. మనజాతికూడా కాస్త పెరుగుతోందనడాకి ఇవి ఒక నిదర్శనం.

—పాలగుమ్మి పద్మరాజు.

Title : NOVEL